RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 175 | జులై 26 శనివారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 175 | July 26 Saturday2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


రియల్‌పై తప్పుడు ప్రచారాలు నమ్మొద్దు 2

# కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా



**న్యూఢిల్లీ జనసంఘర్షణ:**
వైద్య విద్య ప్రవేశ పరీక్ష నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ ఉదంతం, ఆ తదనంతరం దేశవ్యాప్తంగా మిన్నంటిన విద్యార్థుల నిరసనల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. శనివారం ఆయన తన రాజీనామా లేఖను ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి సమర్పించారు. యువజన సంఘాలు, ప్రతిపక్షాల నుంచి వ్యక్తమైన తీవ్ర వ్యతిరేకత, ఢిల్లీలోని జంతర్ మంతర్ సహా పలు ప్రాంతాల్లో మిన్నంటిన ఆందోళనల నడుమ ఈ పరిణామం చోటుచేసుకుంది. పరీక్ష నిర్వహణలో అక్రమాలు వెలుగులోకి వచ్చిన వెంటనే కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమై సిబిఐ విచారణకు ఆదేశించిందని, ఆ తదనంతరం విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మే 3న జరిగిన పరీక్షను రద్దు చేసి, జూన్ 21న సుమారు 20 లక్షల మందికి పైగా విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో తిరిగి విజయవంతంగా నిర్వహించినట్లు ప్రధాన్ గుర్తుచేశారు. ఎగ్జామ్ మాఫియా వల్ల ప్రతిభావంతులైన విద్యార్థులకు అన్యాయం జరగకూడదనే ఉద్దేశంతో తాను మొదటి రోజు నుంచే బాధ్యతాయుతంగా వ్యవహరించానని, వచ్చే ఏడాది నుంచి ఈ పరీక్షను పూర్తిగా కంప్యూటర్ ఆధారిత విధానంలో (జదీ) నిర్వహించాలని నిర్ణయించినట్లు స్పష్టం చేశారు. ఇటీవల వెలువడిన ఫలితాల్లో నిరుపేద, వెనుకబడిన వర్గాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని ఆనందం వ్యక్తం చేశారు. అయితే, విద్యార్థుల ఆందోళనలను ఆసరాగా చేసుకుని కొందరు బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తులు వారిని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం తనను తీవ్రంగా బాధించిందని ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. ఈ గందరగోళ పరిస్థితిని దేశవ్యతిరేక శక్తులు తమ స్వార్థానికి వాడుకోకుండా

➤ మిగతా 2వ పేజిలో..

# ధర్మేంద్ర ప్రధాన్‌ను అభినందించిన అమిత్ షా

## మోడీ-షా అత్యవసర భేటీ

**న్యూఢిల్లీ జనసంఘర్షణ :**
కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన నేపథ్యంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆయన నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర ప్రధాన్‌ను అమిత్ షా ప్రత్యేకంగా ప్రశంసించారు. తన హయాంలో దేశ విద్యా వ్యవస్థలో ఆయన అనేక కీలక సంస్కరణలు, విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని కొనియాడారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా సమర్పించిన కొద్దిసేపటికే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, హోంశాఖ మంత్రి అమిత్ షా అత్యవసరంగా

➤ మిగతా 2వ పేజిలో..

## కేంద్ర విద్యాశాఖ అదనపు బాధ్యతలు

# ప్రహ్లాద్ జోషికి అప్పగింత

**న్యూఢిల్లీ జనసంఘర్షణ :**
కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ చేసిన రాజీనామాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారు. ఈ పరిణామం అనంతరం విద్యాశాఖ అదనపు బాధ్యతలను కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సలహా మేరకు రాష్ట్రపతి భవన్ ఈ మేరకు అధికారిక ఆదేశాలను జారీ చేసింది. ప్రస్తుతం కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు ప్రజా పంపిణీ శాఖలతో పాటు పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖల బాధ్యతలను పర్యవేక్షిస్తున్న

➤ మిగతా 2వ పేజిలో..

# ఢిల్లీలో జంతర్ మంతర్ ఆందోళనకు ముగింపు

## సిజెపితో చర్చలు సఫలం, కేసుల ఎత్తివేతకు కేంద్రం అంగీకారం



**న్యూఢిల్లీ జనసంఘర్షణ:** నీట్ పేపర్ లీకేజీ ఉదంతంపై దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద గత కొన్ని రోజులుగా సాగుతున్న ఆందోళనలు ఎట్టకేలకు ముగిశాయి. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో పాటు ఆందోళనకారుల ప్రధాన డిమాండ్లపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) తన నిరసనను విరమిస్తున్నట్లు ప్రకటించింది. కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌లతో సీజేపీ ప్రతినిధులు జరిపిన సుదీర్ఘ చర్చలు ఫలించడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. అనంతరం రెండు వర్గాల ప్రతినిధులు సంయుక్తంగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి జేపీ నడ్డా మాట్లాడుతూ, నిరసనల సమయంలో విద్యార్థులు, యువతపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను ఎత్తివేసేందుకు ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. కేవలం ఢిల్లీలోనే కాకుండా బీజేపీ పాలిత రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా

➤ మిగతా 2వ పేజిలో..

## చట్టసభల్లో పోటీ చేసే వయోపరిమితిని

# 21 ఏళ్లకు తగ్గించాలి

## హైదరాబాద్ కొవ్వొత్తుల ర్యాలీలో సీఎం రేవంత్‌రెడ్డి




**హైదరాబాద్ జనసంఘర్షణ:**
ఎమ్మెల్యేలు, ఎంపీలుగా పోటీ చేసేందుకు నిర్ణయించిన ప్రస్తుత వయోపరిమితిని 21 ఏళ్లకు తగ్గించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర అసెంబ్లీలో త్వరలోనే తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపుతామని ఆయన వెల్లడించారు. నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీకి వ్యతిరేకంగా ఢిల్లీలో నిరసన తెలిపిన విద్యార్థులపై జరిగిన దాడిని ఖండిస్తూ, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ నేతృత్వంలో నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడారు. దేశ జనాభాలో దాదాపు 30 శాతం ఉన్న యువత నేరుగా చట్టసభలకు వచ్చి పాలనలో భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందని రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రపంచంలోని పలు అభివృద్ధి చెందిన దేశాల్లో ఉన్న విధంగానే భారత్‌లోనూ 21 ఏళ్లకే పోటీ చేసే

➤ మిగతా 2వ పేజిలో..

# ఢిల్లీలో జంతర్ మంతర్ ఆందోళనకు ముగింపు

**మొదటిపేజీ తరువాయి...** నమోదైన కేసులను నాలుగు రోజుల్లో విత్‌డ్రా చేసుకుంటామని, భవిష్యత్తులో కూడా ఎలాంటి కేసులతో విద్యార్థులను వేధించబోమని స్పష్టమైన హామీ ఇచ్చారు. నీట్ వ్యవహారంలో ఆత్మహత్య చేసుకున్న బాధిత విద్యార్థుల కుటుంబాలకు నిబంధనలకు లోబడి తగిన పరిహారం అందిస్తామని, విద్యావ్యవస్థ మరియు పరీక్షల నిర్వహణలో సమూల మార్పులు తీసుకువస్తామని వెల్లడించారు. అనంతరం సీజేపీ ప్రతినిధులు మాట్లాడుతూ, విద్యాశాఖ మంత్రి రాజీనామా తమ మొదటి విజయమని, నిరసనకారులపై పెట్టిన కేసుల ఎత్తివేత, బాధిత కుటుంబాలకు రూ. 1 కోటి పరిహారం మరియు విద్యా సంస్కరణల పట్ల కేంద్రం సానుకూల హామీ ఇవ్వడంతో ఆందోళన విరమిస్తున్నట్లు ప్రకటించారు. విద్యార్థులు, యువత సురక్షితంగా ఇళ్లకు చేరుకోవాలని సూచించారు. ఇదే సమయంలో సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే జంతర్ మంతర్ వద్ద మాట్లాడుతూ, ఇది విద్యార్థుల ఐక్యత సాధించిన విజయమని అభివర్ణించారు. యువత ఓట్లతో అధికారంలోకి వచ్చిన పాలకులకు విద్యార్థుల సత్తా ఏంటో తెలిసివచ్చిందని, తమ మిగిలిన డిమాండ్ల సాధన కోసం భవిష్యత్తులోనూ పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు.

## రియల్‌పై తప్పుడు ప్రచారాలు నమ్మొద్దు

**త్వరలోనే మూసీ సుందరీకరణ టెండర్లు - మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో, ముఖ్యంగా హైదరాబాద్ మహానగరంలో రియల్ ఎస్టేట్ రంగం మందగించిందంటూ కొందరు ఉద్దేశపూర్వకంగా గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని, అందులో ఏమాత్రం వాస్తవం లేదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. నగరంలో శనివారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తమ ప్రభుత్వ రెండున్నరేళ్ల పాలనలో రియల్ ఎస్టేట్ రంగం 15 నుంచి 20 శాతం మేర అభివృద్ధి చెందడమే కాకుండా, ప్లాట్లు మరియు ప్రాపర్టీల విక్రయాలు 40 శాతం వరకు వృద్ధి సాధించాయని తెలిపారు. గత పదేళ్లతో పోలిస్తే రెసిడెన్షియల్ మార్కెట్ గణనీయంగా పుంజుకుందని, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో నమోదు కాబడిన పత్రాల సంఖ్యనే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనమని స్పష్టం చేశారు.

గత 2004 నుండి 2014 మధ్య నాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రుల దూరదృష్టి వల్లే హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగ్ రోడ్డు మరియు ఐటీ రంగాలు అభివృద్ధి చెంది నగరం ప్రపంచ దృష్టిని ఆకర్షించిందని మంత్రి గుర్తుచేశారు. ఇటీవల దావోస్ పర్యటనలో కూడా అనేకమంది అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలు హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపారని తెలిపారు. నగరాభివృద్ధిలో భాగంగా రూ. 7 వేల కోట్లతో తలపెట్టిన మూసీ ప్రాజెక్ట్ సుందరీకరణ త్వరలోనే పట్టాలెక్కనుందని, తొలి విడత కింద 28 కిలోమీటర్ల పరిధి అభివృద్ధికి వారం పది రోజుల్లో టెండర్లు పిలుస్తున్నామని వెల్లడించారు. దీనికితోడు పాతబస్తీని అనుసంధానిస్తూ రెండో విడతగా రూ. 24 వేల కోట్లతో 76 కిలోమీటర్ల మేర మెట్రో రైల్ విస్తరణకు శ్రీకారం చుడుతున్నామని, రీజనల్ రింగ్ రోడ్డు నుండి ఓఆర్ఆర్‌ను కలుపుతూ రేడియల్ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు.

అలాగే రాష్ట్రంలో భూముల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ 'భూభారతి' చట్టాన్ని తీసుకువచ్చామని, అందులోని సాంకేతిక సమస్యలను మరో 15-20 రోజుల్లో పరిష్కరించి పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. రియల్ ఎస్టేట్ రంగానికే కాకుండా పేదల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్న ఆయన, జీహెచ్ఎంసీ (+ఎవీజ) పరిధిలో తొలివిడతగా లక్ష ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని నిర్ణయించామని తెలిపారు. గృహ నిర్మాణ స్థల సేకరణతో పాటు రియల్ ఎస్టేట్ ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు అనుమతుల వేగవంతానికి 'ఫాస్ట్ ట్రాక్' సౌకర్యాన్ని కల్పిస్తామని హామీ ఇచ్చారు. కాగా, ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రఘురామ్ రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు, రియల్ ఎస్టేట్ రంగ ప్రతినిధులు పాల్గొన్నారు.

# చట్టసభల్లో పోటీ చేసే వయోపరిమితిని 21 ఏళ్లకు తగ్గించాలి

**మొదటిపేజీ తరువాయి...** అవకాశాన్ని కల్పించాలని, భవిష్యత్తులో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితే ఈ కీలక మార్పు సాధ్యమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం విద్యార్థులు, యువత సాధించిన చారిత్రాత్మక విజయమని పేర్కొన్న ఆయన, ఈ క్రెడిట్‌ను కాంగ్రెస్ పార్టీ తన ఖాతాలో వేసుకోదని స్పష్టం చేశారు. అయితే నీట్ ఆందోళనల సమయంలో విద్యార్థులపై మోపిన కేసులను కేంద్రం వెంటనే నిబంధనల ప్రకారం తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై సోమవారం ప్రారంభమయ్యే పార్లమెంట్ సమావేశాల్లో కాంగ్రెస్ ఎంపీలంతా గళం విప్పాలని సూచించారు. నీట్ ఉదంతంలో ప్రాణాలు కోల్పోయిన బాధిత విద్యార్థుల కుటుంబాలను ప్రధాని పరామర్శించలేదని విమర్శించిన సీఎం, విద్యార్థుల సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యేంత వరకు కాంగ్రెస్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

అనంతరం పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, జెన్-జీ తరానికి చట్టసభల్లో సముచిత ప్రాతినిధ్యం దక్కాలనే ఉద్దేశంతోనే పోటీ చేసే వయసును 21 ఏళ్లకు తగ్గించే ప్రతిపాదనను తెలంగాణ నుంచే ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల సుదీర్ఘ పోరాటానికి దిగివచ్చి కేంద్ర ప్రభుత్వం విద్యాశాఖ మంత్రి రాజీనామాను ఆమోదించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఈ నిరసన ర్యాలీలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మరియు పెద్ద ఎత్తున కాంగ్రెస్ శ్రేణులు, యువత పాల్గొన్నారు.

## అబద్దాలతో ఆగమాగం అవుతున్న కడియం

**ఆనాడు కాళేశ్వరాన్ని పొగిడి..ఇప్పుడు విమర్శలా**

**దేవాదులకు అసలు వినాశకర్తవు నీవే**

**మండిపడ్డ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య**

**జనగామ :** ఆనాడు కాళేశ్వరం ప్రాజెక్టును ఇంజనీరింగ్ అద్భుతం, వరప్రదాయని, మానస పుత్రిక అని పొగిడిన కడియం శ్రీహరి, నేడు మాటమార్చి కాళేశ్వరం కాదని కూలేశ్వరం అనడం ఆయన నైజానికి నిదర్శనమని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య విమర్శించారు. దేవాదులకు కడియం సృష్టికర్త కాదని, వినాశక కర్త అని ధ్వజమెత్తారు. స్టేషన్ ఘనపూర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గత వారం రోజులుగా నియోజకవర్గంలో తిరుగుతూ కడియం శ్రీహరి అబద్దాలు మాట్లాడుతూ ఆగమాగం అవుతున్నారని ఎద్దేవా చేశారు. ఆయన మాటలన్నీ చిన్నపిల్లల చిలిపి చేష్టలు, కారుకూతల్లాగే ఉన్నాయని మండిపడ్డారు. తెలంగాణను ఎండబెడుతూ ఆంధ్రప్రదేశ్ కి నీటిని దోచిపెట్టేలా రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కాళేశ్వరం అంటే కేవలం మేడిగడ్డ మాత్రమే కాదని, 16 రిజర్వాయర్లకు నీరందించే కల్పతరువు అని స్పష్టం చేశారు. కేసీఆర్‌కు చెడ్డపేరు తేవడానికే కాళేశ్వరంపై రేవంత్ రెడ్డి కుట్రలు చేస్తున్నారని, ఇప్పుడు కేంద్రానికి లేఖలు రాయడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డికి ప్రాజెక్టులపైనా, రైతుల సమస్యలపైనా కనీస అవగాహన లేదని రాజయ్య దుయ్యబట్టారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పాలన వల్ల కరువు వస్తే, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో కడియం శ్రీహరి వల్ల కరువు వచ్చిందని వ్యాఖ్యానించారు. నకిలీ కాంగ్రెస్‌లోకి వెళ్లిన కడియం శ్రీహరి, ఎమ్మెల్యేగా ఉండి కూడా పంటలకు నీళ్లు ఇవ్వలేకపోతున్నానని చెప్పడం సిగ్గుచేటని అన్నారు. కడియం కేవలం కమిషన్లు వచ్చే పనులపైనే దృష్టి పెడతారని, కమిషన్లకు కక్కుర్తి పడి ప్రాజెక్టుల అంచనాలు పెంచిన చరిత్ర ఆయనదని తీవ్ర ఆరోపణలు చేశారు. నియోజకవర్గానికి ఎవరు ఎంత చేశారనే దానిపై బహిరంగ చర్చకు రావలసిందిగా కడియం శ్రీహరికి రాజయ్య సవాల్ విసిరారు. నేను చేసిన అభివృద్ధి పనులపై, నువ్వు చేసిన పనులపై చర్చకు సిద్ధం.. స్టేషన్ ఘనపూర్ అంబేద్కర్ విగ్రహం వద్దకు రావాలని సవాల్ చేశారు. అలాగే అసలు సిసలైన కాంగ్రెస్ నాయకులకు పదవులు రాకుండా కడియం అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. ఎక్కువ మాట్లాడకుండా కుక్కిన పేనులాగా ఉండు బిడ్డా అంటూ కడియం శ్రీహరికి పరోక్షంగా హెచ్చరికలు జారీ చేశారు.

# కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

**మొదటిపేజీ తరువాయి...** చూడటంతో పాటు, జాతీయ ఐక్యతను కాపాడటం మరియు విద్యార్థుల భవిష్యత్తు న్యాయపరమైన చిక్కుల్లో పడకుండా వారి దృష్టిని చదువు వైపు మళ్లించేందుకే తాను పదవి నుంచి తప్పుకుంటున్నట్లు వెల్లడించారు. గత నాలుగు దశాబ్దాలుగా విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు విద్యా రంగ సంస్కరణల కోసం పని చేస్తున్న తనకు ఇది వ్యక్తిగత ప్రతిష్టకు సంబంధించిన అంశం కాదని, విద్యార్థుల ఆకాంక్షలను నెరవేర్చడమే తన ప్రధాన బాధ్యత అని చెప్పారు. తనపై నమ్మకంతో అవకాశం ఇచ్చిన ప్రధాని మోడీకి, మంత్రివర్గ సహచరులకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపిన ఆయన, భవిష్యత్తులోనూ ఒడిశా ప్రజల సంక్షేమం కోసం, దేశ యువత పురోగతి కోసం శ్రమిస్తూనే ఉంటానని తెలిపారు.

# ధర్మేంద్ర ప్రధాన్‌ను అభినందించిన అమిత్ షా

**మొదటిపేజీ తరువాయి...** సమావేశమయ్యారు. ఢిల్లీలోని లోక్‌కల్యాణ్ మార్గ్‌లో ఉన్న ప్రధాని నివాసంలో ఈ భేటీ జరిగింది. రాజీనామా తదనంతరం దేశంలోనూ, రాజధానిలోనూ నెలకొన్న పరిస్థితులు, తదుపరి పరిణామాలు మరియు కేంద్ర మంత్రివర్గంలో చేపట్టాల్సిన మార్పులు చేర్పులపై వీరిద్దరూ సుదీర్ఘంగా చర్చించారు.

## కేంద్ర విద్యాశాఖ అదనపు బాధ్యతలు

# ప్రహ్లాద్ జోషికి అప్పగింత

**మొదటిపేజీ తరువాయి...** ప్రహ్లాద్ జోషి, ఇకపై విద్యాశాఖను కూడా అదనంగా చూసుకోనున్నారు. కర్ణాటకలోని ధార్వాడ్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆయన, భారత్ చొరవతో ఏర్పడిన 'ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్'కు అధ్యక్షుడిగా కూడా వ్యవహరిస్తున్నారు. ధర్మేంద్ర ప్రధాన్ వైదొలిగిన నేపథ్యంలో కీలకమైన విద్యాశాఖ పర్యవేక్షణ బాధ్యతలను ఆయనకు అప్పగించారు.

# ధర్మేంద్ర ఆదర్శంగా.. లోకేశ్ రాజీనామా చేయాలి

**డిఎస్సీలో అక్రమాలకు బాధ్యత వహించాలి**

**జక్కంపూడి రాజా డిమాండ్**

**విజయవాడ, :** ఏపీలో డీఎస్సీలో జరిగిన అక్రమాలకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని వైఎస్సార్‌సీపీ డిమాండ్ చేసింది. ధర్మేంద్ర ప్రధాన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించింది. లోకేష్‌పై వస్తున్న ఆరోపణలకు ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, ఇప్పటివరకూ డీఎస్సీలో అక్రమాలపై చంద్రబాబు, లోకేష్‌లు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించింది. ఆ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది. డీఎస్సీలో అక్రమాలకు బాధ్యత వహించాల్సిన నారా లోకేష్ మంత్రి పదవిలో కొనసాగడం సరికాదని, రాజీనామా చేసి విచారణకు సహకరించాలని సూచించింది. విచారణ నుంచి తప్పించుకోవడం అనుమానాలకు తావిస్తోందని, టీచర్ పోస్టుల కోసం బేరసారాల వీడియోలు బయటకొచ్చినా నామమాత్రపు కేసులతో విచారణను నీరుగార్చారని వైఎస్సార్‌సీపీ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ప్రజలకు పూర్తి వివరాలు వెల్లడించాల్సిన అవసరం ఉందని, ఇందులో నిజాలు నిగ్గు తేల్చే వరకూ ప్రజా ఉద్యమం కొనసాగిస్తామని వైఎస్సార్‌సీపీ హెచ్చరించింది. నీట్ పేపర్ లీక్ అంశానికి సంబంధించి సీజేపీ ఆందోళనలతో కేంద్ర విద్యాశాఖ పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని, ఆయన్ని అనుసరిస్తూ ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కూడా రాజీనామా చేయాలని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా డిమాండ్ చేశారు. ఏపీ డీఎస్సీలో అక్రమాలు జరిగిన విషయం అందరికి తెలిసిన విషయమేనని, దానికి నారా లోకేష్ బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలన్నారు. జాతీయ నేత ధర్మేంద్ర ప్రధాన్‌ను ఆదర్శంగా తీసుకుని నారా లోకేష్ కూడా రాజీనామా చేయాలన్నారు. కేంద్రంలో టీడీపీ భాగస్వామ్య పార్టీ కాబట్టి వారిని అనుసరిస్తూ లోకేష్ రాజీనామా చేయాలన్నారు. డీఎస్సీలో జరిగిన తప్పిదాలకు బాధ్యత వహిస్తూ తక్షణమే లోకేష్ రాజీనామా చేయాలని, ఆలా చేయకపోతే యువత ఆగ్రహానికి లోకేష్ గురి కావాల్సి వస్తుందన్నారు.

# పోలీసుల చేతుల్లో ప్రకృతి పరిరక్షణ

- మెదక్‌లో దురాక్రమణ కలుపు మొక్కల నిర్మూలన.






**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 25 (జన సంఘర్షణ)**

పర్యావరణం, జీవవైవిధ్యానికి హాని కలిగిస్తున్న దురాక్రమణ విదేశీ కలుపు మొక్కల నిర్మూలనపై మెదక్ జిల్లా పోలీసు కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈకో ఫాన్ సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఐపీఎస్, డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐలు మహేష్, కృష్ణమూర్తి, ఆర్ఐ శైలేందర్, ఎస్ఐలు,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. పోలీసు సిబ్బందిని నాలుగు బృందాలుగా ఏర్పాటు చేసి కార్యాలయ ఆవరణలోని దురాక్రమణ కలుపు మొక్కలను గుర్తించి తొలగించారు. ఇందులో వయ్యారి భామ లాంటానా, హైప్టిస్, ఆల్టర్నాంథెరా తదితర మొక్కలను తొలగించారు. అత్యధికంగా కలుపు మొక్కలను తొలగించిన బృందాలకు ఈకో ఫాన్ సొసైటీ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ వ్యవస్థాపకుడు మెట్టు సాయి సంపత్ మాట్లాడుతూ.. దురాక్రమణ విదేశీ కలుపు మొక్కలతో జీవవైవిధ్యం, వ్యవసాయం,అడవులు, పశువుల మేత భూములు, జలవనరులకు నష్టం కలుగుతోందన్నారు. వీటిని సులభంగా గుర్తించడం, సకాలంలో తొలగించడం ద్వారా స్థానిక వృక్షజాలాన్ని, పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని వివరించారు. రాష్ట్ర సమన్వయకర్త తలారి విక్రమ్ మాట్లాడుతూ.. దురాక్రమణ కలుపు మొక్కల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం పోలీసు సిబ్బందికి కలుపు మొక్కలను గుర్తించే విధానంపై ప్రత్యక్ష శిక్షణ ఇచ్చారు. 'దురాక్రమణ విదేశీ కలుపు మొక్కలకు థంబ్స్ డౌన్' అంటూ ప్రతిజ్ఞ చేశారు. స్థానిక జీవవైవిధ్య పరిరక్షణకు మద్దతుగా నిర్వహించిన సంతకాల సేకరణ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రభుత్వ శాఖలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు,ప్రజలు సమష్టిగా కృషి చేస్తేనే దురాక్రమణ విదేశీ కలుపు మొక్కల వ్యాప్తిని అరికట్టి తెలంగాణ సహజ సంపదను కాపాడగలమని నిర్వాహకులు తెలిపారు.

# విద్యార్థులకు ప్రపంచంతో పోటీపడే విద్య అందే దిశగా పటిష్ట చర్యలు తీసుకుంటాం..

- మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్





**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 25 (జన సంఘర్షణ)**

మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలో నూతనంగా నిర్మాణంలో ఉన్న.యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను అధికారులతో కలిసి కలెక్టర్ శనివారం పరిశీలించారు. ముందుగా కలెక్టర్ మ్యాప్‌ను పరిశీలిస్తూ కన్స్ట్రక్షన్ విధి విధానాలు క్షుణ్ణంగా అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రామాయణపేట పట్టణంలో 200 కోట్ల రూపాయల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులు జరుగుతున్నాయని వేలాది మంది విద్యార్థులు విద్య అభ్యసించే విధంగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలరూ పుదిద్దుకుంటుందన్నారు. నిర్మాణ పనులలో నాణ్యతలో రాజీ లేకుండా ప్రస్తుతం ఉన్న వర్కర్ల కంటే అధికంగా వర్కర్లను ఎంగేజ్ చేసుకుని అత్యంత నాణ్యత ప్రమాణాలతో భవన నిర్మాణ పనులు వేగంగా జరిగేలా పటిష్ట ప్రణాళిక ద్వారా చర్యలు చేపట్టాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రాజు, విద్య, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, రామాయంపేట తాసిల్దార్ రజని, సీఎం ఓ రాజు, గణాంక అధికారి నవీన్ మెగా ఇంజనీరింగ్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఆంజనేయులు, ఏ ఈ సఫి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయురాలిగా మారిన కలెక్టర్

- పాఠాలు బోధించి సామర్థ్యాలు పరిశీలించి.
- సంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్.
- అన్ని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలి.
- భోజనం, చదువు, క్రీడలు ప్రతి విద్యార్థి దినచర్యలో ఉండాలి.
- సాధన ద్వారానే మంచి భవిష్యత్.
- చేగుంట మండలంలో కలెక్టర్ పర్యటన.
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.





**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 25 (జన సంఘర్షణ)**

విద్యార్థి దశ నుంచి క్రమశిక్షణను అలవాటు చేసుకోవాలని, అప్పుడే భవిష్యత్ కు మంచి మార్గం ఏర్పడుతుందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. శనివారం జిల్లాలోని చేగుంట మండల పరిధిలో గల కేజీబీవీని కలెక్టర్ సందర్శించారు. ముందుగా 06,07 తరగతుల విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. 08 వరకు టేబుల్స్ చెప్పడంతో కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం 10వ తరగతిలో అన్ అకాడమీ తరగతులను పరిశీలించారు, ఫాస్ట్ మ్యాథ్స్, పుస్తకాల ప్రాధాన్యతను తెలుసుకోవాలన్నారు. కొన్ని కంప్యూటర్లు మరమ్మతులు గురి కాబడినవని కలెక్టర్ తెలుసుకొని వెంటనే బాగు చేయించి అందరికీ అన్ అకాడమీ అందుబాటులో తీసుకురావాలన్నారు. వంట గదిలోకి వెళ్లి,వంట సరకులను, సిద్ధం చేసిన భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు. డైట్ చార్ట్ ప్రకారం వంటలు చేశారా? లేదా? అని అడిగి, ఎంత మంది విద్యార్థులు ఉన్నారు? కలెక్టర్ ఆరా తీశారు. కేజీబీవీ పరిసరాల చుట్టూ పారిశుధ్య నిర్వహణ బాగుండాలని, ఎలాంటి చెత్తచెదారం లేకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని కేజీబీవీలలో కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అందరికీ అన్ని అంశాలు తెలియదని, ప్రతిరోజూ చదివితే తెలియని అంశాల మీద పట్టు సాధించవచ్చన్నారు. ప్రతి పోటీ పరీక్షలో మ్యాథ్స్ తప్పనిసరిగా ఉంటుందని, ఫాస్ట్ మ్యాథ్స్ పుస్తకంలోని అంశాలను నేర్చుకుంటే గణితంలో ఉండే లెక్కల సాధన సులభ తరం అవుతుందని యూట్యూబ్ వీడియోల కంటే అన్ అకాడమీ తరగతులు చాలా ఉపయోగ పడతాయన్నారు. ప్రణాళికా ప్రకారంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు అన్నీ బోధించాలన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకురావాలని లికలెక్టర్‌లివిద్యాశాఖ అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ఎల్లయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, బి డబ్ల్యు ఓ హేమా భార్గవి, ఎంపీడీవో చెన్నారెడ్డి, గణాంక అధికారి నవీన్ కేజీబీవీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# నల్ల పోచమ్మ తల్లి బోనాలకు తరలిరండి

- ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో కంఠరెడ్డి. తిరుపతిరెడ్డికి ఆహ్వానం.



**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 25 (జన సంఘర్షణ)**

మెదక్ పట్టణంములోని నల్ల పొచ్చమ్మ బోనాలు మెదక్ పట్టణ ముదిరాజ్ సంఘం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరుగునున్న బోనాలకు బిఆర్ ఎస్ పార్టీ మెదక్ నియోజకవర్గ ఇంచార్జ్ కంఠ రెడ్డి తిరుపతి రెడ్డికి ముదిరాజ్ సోదరులు బోనాల ఆహ్వాన పత్రికను బోనాల మహోత్సవానికి రావాలని కోరారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నల్లపోచమ్మ అమ్మవారికి బోనాల మహోత్సవం, ఆగస్టు 3న పలహారం బండి కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు సున్నం.నరేష్, నిమ్మల నాగులు, తలారి.సంతోష్, ఇప్ప భరత్, తొడంగుల. సంపత్, లోకమైన మనోహర్, చింతల.కార్తీక్, ఆది శశాంక్, పురం హరిప్రసాద్, జంగిటి చరణ్, మహేష్, శశాంక్, ఇప్ప నరేష్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ భయంతో గ్రామస్తులు

- చర్యలు తీసుకోవాలని తిమ్మాక్కపల్లి గ్రామస్థుల విజ్ఞప్తి.



**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 25 (జన సంఘర్షణ)**

మెదక్ మండలం లోని తిమ్మకపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకర పరిస్థితిలో ఉండటంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి ఉండటంతో పాటు విద్యుత్ వైర్లు కూడా కిందకు వంగి ఉండటం ప్రమాదానికి దారితీసే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. పలుమార్లు ట్రాన్సకో అధికారులకు సమాచారం ఇచ్చమని ఇంతవరకు పట్టించ్చుకోవడం లేదుని అన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ట్రాన్స్‌ఫార్మర్ పరిసర ప్రాంతంలో నీరు నిల్వ ఉండటం వల్ల ప్రమాదం మరింత పెరిగే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులు, గ్రామస్థులు నిత్యం ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ శుభ్రపరిచి, అవసరమైన మరమ్మతులు చేపట్టి ప్రమాదం జరగకముందే చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# రామాయంపేటలో తొలిసారిగా శ్రీ జగన్నాథ రథయాత్ర అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు



**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 25 (జన సంఘర్షణ)**

మెదక్ జిల్లా రామాయంపేటలో తొలిసారిగా శ్రీ జగన్నాథ రథయాత్ర అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడింది. ఈ పవిత్ర కార్యక్రమంలో పట్టణ ప్రజలు, భక్తులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ మహత్తర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజుకి హృదయపూర్వక ధన్యవాదాలు అభినందనలు. అలాగే ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ కౌన్సిలర్లందరికీ, ప్రజాప్రతినిధులకు, అధికారులు, నిర్వాహక కమిటీ సభ్యులకు, స్వచ్ఛంద సేవకులకు, భక్తులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు.

# బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి అండగా నిలిచిన కంఠరెడ్డి తిరుపతిరెడ్డి

- రూ.5 వేల ఆర్థిక సాయం.



**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 25 (జన సంఘర్షణ)**

రామాయంపేట మండలం ఝాన్సీ లింగాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త బండమీది ప్రభాకర్ తల్లి అకాల మరణం చెందడంతో, ఆ కుటుంబానికి బీఆర్ఎస్ జిల్లా నాయకులు కంఠరెడ్డి తిరుపతిరెడ్డి అండగా నిలిచారు. రైతుబంధు మండల మాజీ అధ్యక్షుడు బానప్పగారి నర్సారెడ్డి ఈ విషాద సంఘటనను తిరుపతిరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించిన ఆయన బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ నాయకుల ద్వారా రూ. 5 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన బీఆర్ఎస్ నాయకులు, పార్టీ ఎల్లప్పుడూ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు తుడుం శ్రీనివాస్, స్వామి, ఎర్ర సత్తయ్య, జీవన్ కుమార్, సీహెచ్ పోచయ్య, కర్రే అశోక్, బండమీది స్వామి తదితరులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

- కాంగ్రెస్ పార్టీ నాయకుడు, లీలా గ్రూప్ చైర్మన్ మీనాక్షి డాక్టర్ మోహన్ నాయక్ అందజేత.



**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 25 (జన సంఘర్షణ)**

మెదక్ మండలం శివాయిపల్లి గ్రామానికి చెందిన తుపాకుల నవీన్ ఆర్థిక సమస్యలతో మరణించారు. ఇట్టి సమాచారాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు, లీలా గ్రూప్ చైర్మన్ మీనాక్షి డాక్టర్ మోహన్ నాయక్ వారి ఊరికి చేరుకొని కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి 5,000 రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, మధు, వెంకటేష్, శేఖర్, మహేష్, సురేష్, బాలకృష్ణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన డాక్టర్ రవి బాదావత్

- ప్రజా సేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్ష




**వైరా, జూలై 25:**

వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ జన్మదిన సందర్భంగా ప్రముఖ వైద్యుడు డాక్టర్ రవి బాదావత్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి బాదావత్ మాట్లాడుతూ.. ప్రజల సేవలో నిరంతరం ముందుండే ఎమ్మెల్యే రాందాస్ నాయక్ నాయకత్వం ప్రజలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఆయన మరింత సేవ చేసే అవకాశం కలగాలని ఆకాంక్షించారు. అలాగే ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌కు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, విజయాలు చేకూరాలని, వైరా నియోజకవర్గం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని మనస్ఫూర్తిగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

జన సంఘర్షణ

ఆదివారం
26 జులై 2026

# బాలికల భద్రతపై ప్రత్యేక దృష్టి

- ప్రతి విద్యార్థినికి అండగా 'పోలీస్ అక్క'.
- ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి.
- మెదక్ జిల్లాఎస్పీ డి.వి. శ్రీనివాసరావు.





**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 25 (జన సంఘర్షణ)**
విద్యార్థినుల భద్రతకు 'పోలీస్ అక్క' అండగా నిలుస్తుందని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. పెద్ద శంకరంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 'పోలీస్ అక్క' కార్యక్రమాన్ని ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. విద్యార్థినులు ఎలాంటి సమస్య ఎదురైనా భయపడకుండా 'పోలీస్ అక్క'ను సంప్రదించాలని సూచించారు. మహిళలు, బాలికల భద్రతకు పోలీస్ శాఖ అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు.విద్యార్థినుల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి 'పోలీస్ అక్క'లు కృషి చేస్తారని తెలిపారు. మహిళల భద్రత, సైబర్ నేరాలు,ర్యాగింగ్,ఈవ్‌టీజింగ్, బాల్య వివాహాలు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు,మహిళా రక్షణ చట్టాలపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా పెద్ద శంకరంపేట పోలీస్‌స్టేషన్ పరిధికి 'పోలీస్ అక్క'గా గౌతమి, కానిస్టేబుల్‌ను నియమించారు. విద్యార్థినులకు 'పోలీస్ అక్క' ఫోన్ నంబర్‌ను అందించారు. విద్యార్థినులు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా పోలీస్ అక్కకు చెప్పేందుకు ఎలాంటి భయం, సందేహం అవసరం లేదని ఎస్పీ తెలిపారు. సమస్యలను నేరుగా పోలీస్ అక్కను కలిసి లేదా ఫోన్ ద్వారా తెలియజేయాలని సూచించారు. విద్యార్థినుల సమస్యలను గోప్యంగా తెలుసుకుని,అవసరమైన సహాయం అందించడంతో పాటు వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు,ఓటీపీలు, బ్యాంకు సమాచారం పంచుకోవద్దని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్--112, షీ టీమ్స్‌ను ఆశ్రయించాలని, సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.పోలీస్ అక్క' కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తూ వారితో స్నేహపూర్వకంగా మమేకమవుతారని ఎస్పీ తెలిపారు.వారి సమస్యలు, భవిష్యత్తు లక్ష్యాలను తెలుసుకుని అవసరమైన మార్గదర్శకత్వం అందిస్తారని పేర్కొన్నారు.గుడ్ టచ్,బ్యాడ్ టచ్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించడంతో పాటు విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసం,క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత పెంపొందేలా ప్రోత్సహిస్తారని చెప్పారు.విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ఎస్పీ సూచించారు. ఎలాంటి సమస్య ఎదురైనా దాచిపెట్టకుండా 'పోలీస్ అక్క'కు తెలియజేయాలని చెప్పారు. విద్యార్థినుల భద్రతకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐలు రేణుక, సందీప్‌రెడ్డి,ఎస్ఐలు శంకర్, ప్రవీణ్‌రెడ్డి, పోచయ్య, 'పోలీస్ అక్క' గౌతమి, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది,విద్యార్థినులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యం గెలిచింది - యువత ఐక్యతకు ఇది నిదర్శనం...

- సింగరేణి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గుగులోత్ హర్ష నాయక్.

**జూన్ 25, (జన సంఘర్షణ)**
నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంపై దేశవ్యాప్తంగా విద్యార్థులు,యువత చేపట్టిన నిరసనలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శనమని సింగరేణి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గుగులోత్ హర్ష నాయక్ పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడిన వారిపై దేశ యువత ఐక్యంగా గళమెత్తడంతో కేంద్ర ప్రభుత్వం స్పందించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన అన్నారు. విద్యా వ్యవస్థపై ప్రజల్లో నెలకొన్న ఆందోళనకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయడం ప్రజాస్వామ్య విజయానికి నిదర్శనమని అభిప్రాయపడ్డారు. దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉంటుందని,వారి భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టేలా ప్రశ్నాపత్రాల లీకేజీలు జరగడం అత్యంత బాధాకరమని అన్నారు. ఇటువంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో పూర్తి పారదర్శకతను తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంలో ప్రమేయం ఉన్న ప్రతి ఒక్కరిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుని, నిందితులకు కఠిన శిక్షలు విధించాలని ఆయన కోరారు. అలాగే విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించే విధంగా కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈరోజు దేశవ్యాప్తంగా యువత,విద్యార్థులు ఐక్యంగా నిలబడి తమ శక్తి ఏమిటో నిరూపించారని,ప్రజాస్వామ్యంలో ప్రజల గొంతు ఎంత శక్తివంతమో మరోసారి చాటిచెప్పారని గుగులోత్ హర్ష నాయక్ పేర్కొన్నారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం యువజన కాంగ్రెస్ ఎల్లప్పుడూ పోరాటం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఇంతటితో యువత పోరాటం ఆగిపోదని,విద్యార్థుల హక్కులు పూర్తిగా రక్షించబడే వరకు ఉద్యమం కొనసాగుతుందని ఆయన అన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజా సమస్యలు,విద్యార్థుల సమస్యలపై దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించేందుకు యువత సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో యువత శక్తి ఎంత గొప్పదో ఈ ఒక్క సంఘటనతోనే దేశానికి స్పష్టమైందని,రాబోయే రోజుల్లో దేశ రాజకీయాలను యువత మరింత ప్రభావితం చేసే స్థాయికి ఎదుగుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.



ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా వ్యవహరించే ఏ ప్రభుత్వమైనా ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజల తీర్పును ఎదుర్కోవాల్సిందేనని అన్నారు. దేశ భవిష్యత్తును నిర్మించేది యువతేనని, యువత ఐక్యంగా ఉంటే ఎలాంటి మార్పునైనా సాధించగలదని ఈ ఉద్యమం మరోసారి నిరూపించిందని గుగులోత్ హర్ష నాయక్ పేర్కొన్నారు.

# రీ సర్వేతో భూ సమస్యల పరిష్కారం

- అదనపు కలెక్టర్ నగేష్.

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 25 (జన సంఘర్షణ)**
ప్రభుత్వ ఆదేశం ప్రకారం జిల్లాలో భూముల రీ సర్వే ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. శనివారం జిల్లాలోని మాసాయిపేట మండలం పోతంశెట్టిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభ కార్యక్రమానికి ఏడి ల్యాండ్ సర్వే కిషన్, మండల తహసిల్దార్ తో కలిసి అదనపు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూముల సర్వే, రీ సర్వే తో భూ సమస్యల పరిష్కారం సులభతరం అవుతుందని, భవిష్యత్తులో భూమి వివాదాలు లేకుండా రికార్డులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రికార్డులు, మోకా, పట్టాదారుల వివరాలు ఇతర అంశాలను పరిగణలోకి తీసుకొని ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గ్రామంలోని భూములకు సంబంధించి హద్దులు నిర్ధారించడం జరుగుతుందని, తద్వారా గ్రామానికి సంబంధించిన భూమి స్పష్టత వస్తుందని, ప్రభుత్వ భూములు సైతం నిర్ధారణ అవుతాయని తెలిపారు. పట్టా కలిగి ఉండి మోకాపై లేకపోవడం,మోకాపై ఉండి పట్టా కలిగి ఉండకపోవడం అంశాలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రభుత్వం భూములను ఆక్రమించినట్లయితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. సర్వే ప్రక్రియ సమగ్రంగా నిర్వహించి మ్యాపింగ్ చేయడం జరుగుతుందని,ఈ క్రమంలో భూ సమస్యలు తలెత్తినట్లయితే న్యాయపరమైన చర్యలకు సులభతరమవుతుందని, మ్యాపింగ్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఈ చర్యలలో భాగంగా నిబంధనల ప్రకారం సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేయడం జరుగుతుందని, న్యాయపరంగా రావలసిన భూమి అందుతుందని తెలిపారు. భూములలో కబ్జాదారుల జాబితా తయారు చేయడం జరుగుతుందని, పట్టా భూముల సర్వే అనంతరం రికార్డులను సరి చూసి సర్వే నెంబర్ల ప్రకారం హద్దుల నిర్ధారణ జరుగుతుందని, పట్టాలో ఒక సర్వే నెంబరు, మోకాలో ఒక సర్వే నెంబరు అంశాలపై మ్యాపింగ్ ప్రకారం పకడ్బందీగా చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. మ్యాపింగ్ తయారు తర్వాత మార్పులు కష్టతరమని, భూములకు సంబంధించి స్పష్టమైన వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. సర్వేయర్లు, ప్రజల సహకారంతో సమస్యల పరిష్కారం వేగవంతం అవుతుందని తెలిపారు. అనంతరం పోతంశెట్టిపల్లి గ్రామంలో చెరువు సి ఖశీ భూమిని అదనపు కలెక్టర్ నగేష్ పరిశీలించి ప్రభుత్వ భూమి కబ్జా కాకుండా పరిరక్షించాల్సిన బాధ్యత మనపై ఉందని తగు చర్యలు తీసుకోవాలని





తాసిల్దార్లను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఏడి ల్యాండ్ సర్వే కిషన్, మాసాయిపేట తాసిల్దార్ రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పదోన్నతితో బాధ్యత మరింత పెరుగుతుంది

- పదోన్నతి పొందిన పోలీసులకు ర్యాంక్ చిహ్నాలు అలంకరించిన ఎస్పీ.డి.వి. శ్రీనివాస రావు.



**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 25 (జన సంఘర్షణ)**
మెదక్ జిల్లా అల్లాదుర్గ్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న గాలయ్య ఎస్ఐగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు గాలయ్యకు ఎస్ఐ ర్యాంక్ చిహ్నాలను అలంకరించి అభినందించారు. అదేవిధంగా నర్సాపూర్‌లో హెడ్ కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తున్న ఆర్.తుకారాం, ఈ. వీరన్నలు ఏఎస్సైలుగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా వారు జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీ వారికి ఏఎస్సై ర్యాంక్ చిహ్నాలను అలంకరించి అభినందనలు తెలిపారు. పదోన్నతితో బాధ్యతలు మరింత పెరుగుతాయని, విధుల్లో అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎస్పీ సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు.

# భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు

- ఆలయాల్లో భక్తుల సందడి.




**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 25 (జన సంఘర్షణ)**
హిందువులు పవిత్రంగా జరుపుకునే తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. శనివారం తొలిఏకాదశి పర్వదినం కలిసిరావడంతో చాలా మంది భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టారు.అలాగే పట్టణంలోని చమన్ హనుమాన్ ఆలయం, శ్రీ వేంకటేశ్వర ఆలయం, శ్రీ కోదండ ఆలయం ప్రాంగణంలో గల శివాలయం, శనేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులతో ఆలయాల్లో సందడి నెలకొంది. ప్రత్యేక పూజలు నిర్వహించిన పూజారులు భక్తులకు తీర్థ ప్రసాదాలు ఇచ్చి ఆశీర్వదించారు.

# జలసిరి కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

- రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క.



**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 25 (జన సంఘర్షణ)**
జలసిరి కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు.మంత్రి సీతక్క, సెర్ప్ సీఈఓ, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్, ఇతర అధికారులతో కలిసి అన్ని జిల్లాల స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు, ఇతర అధికారులతో శనివారం సాయంత్రం జలసిరి కార్యక్రమం, విబిజి రామ్ జి పనులు, గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. భవిష్యత్తులో నీటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు జలసిరి కార్యక్రమంలో భాగంగా నీటి సంరక్షణ నిర్మాణాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి పంటకు పంట కుంట, ప్రతి ఊరికి ఊట కుంట, కానీ నినాదంతో భూగర్భ జలాల సంరక్షణకు చర్యలు ప్రారంభించామని అన్నారు. ప్రతి రైతు తమ పొలాలలో ఫామ్ పాండ్ నిర్మించుకునేలా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత ఉండాలన్నారు. రైన్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాల ద్వారా భూగర్భ జలాల సంరక్షణ సాధ్యమవుతుందని తెలిపారు. విబిజి రామ్ జి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులలో దేశంలోనే ముందువరుసలో ఉన్నామని అన్నారు. అర్హులైన ప్రతి పేద కూలీలందరికీ పని దినాలు కల్పించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి ఈవీసీలో అదనపు కలెక్టర్ నగేష్,జెడ్పి సీఈవో ఎల్లయ్య,డిఆర్డిఓ శ్రీనివాసరావు ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అక్కన్నపేట గ్రామానికి విచ్చేసిన మాజీ గిడ్డంగుల సంస్థ చైర్ పర్సన్

- రజిని సాయి చంద్.



**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 25 (జన సంఘర్షణ)**
మెదక్ (జిల్లా) నియోజకవర్గం, రామాయంపేట మండలం, అక్కన్నపేట గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు, తెలంగాణ కళాకారుడు సాయి చంద్ వీరాభిమాని బోడ శ్రీకాంత్ (బబ్లూ) సంధ్య దంపతులకు కూతురు పుట్టిన సందర్భంగా 21వ రోజు నామకరణ కార్యక్రమనికి అనివార్య కారణాల వల్ల రాలేకపోయినా రజిని సాయి చందు ఈరోజు సమయం తీసుకుని అభిమాని బోడ శ్రీకాంత్(బబ్లూ) ఆహ్వానం మేరకు అక్కన్నపేట గ్రామంలో వారి ఇంటికి వచ్చి వారికి జన్మించిన పాప "కృతిక" కి వారి కుటుంబ సభ్యులకు ఆశీర్వాదం అందించడం జరిగింది. ఇదే సందర్భంలో ప్రస్తుత పార్టీ సంస్థ గత విషయాలపై ఎస్ ఐ ఆర్ ప్రక్రియ గురించి కార్యకర్తలతో చర్చించడం జరిగింది.ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీకాంత్ సాగర్, చిట్టిమల్లి నరేందర్ రెడ్డి, శ్రావణ్ గౌడ్, పాపయ్యగారి నర్సింలు, వెల్ముల మహేష్ యువజన విభాగం నాయకులు వంశీ సాగర్, పవన్ కల్యాణ్ సాగర్, అజయ్ సాగర్, పవన్ సాగర్, కిషోర్, లక్ష్మణ్, వేణు, ప్రశాంత్ , మధు, పార్టీ కార్యకర్తలు సాయి చంద్ అభిమానులు ఉన్నారు.

## వైకుంఠ ఏకాదశి వేళ.. భక్తజన సందోహంతో బైరాపూర్ విఠలేశ్వర ఆలయం

- పాదయాత్రగా తరలివచ్చిన భక్తులు..
- 'జై విఠల్.. జై విఠల్' నామస్మరణతో మార్మోగిన దారులు....
- మరో పండరిపూర్‌గా ప్రసిద్ధి చెందిన బైరాపూర్ విఠలేశ్వర క్షేత్రం

బైరాపూర్,/ జూలై 25 /(జన సంఘర్షణ)



బీర్కూరు మండల కేంద్రంలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని బైరాపూర్ విఠలేశ్వర ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాదయాత్రగా ఆలయానికి తరలివస్తూ తమ భక్తిని చాటుకుంటున్నారు. భక్తుల నామస్మరణలు, భజనలతో ఆలయ పరిసర ప్రాంతం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. పండరీపురం విఠోబా ఆలయాన్ని తలపించేలా బైరాపూర్‌లో కొలువైన విఠలేశ్వర స్వామివారిని దర్శించుకునేందుకు ప్రతి ఏటా వేలాది మంది భక్తులు తరలివస్తున్నారు. దీంతో ఈ క్షేత్రం భక్తుల నోట లి'మరో పండరిపూర్'లిగా ప్రసిద్ధి చెందుతోంది. ఆలయానికి వెళ్లే మార్గమంతా భక్తులు 'జై విఠల్.. జై విఠల్' అంటూ భజనలు, నామస్మరణ చేస్తూ పాదయాత్రగా సాగారు. మహిళలు తలపై కలశాలు, పూలు, నైవేద్యాలతో స్వామివారి దర్శనానికి తరలివచ్చారు. పచ్చని పొలాల మధ్యగా సాగిన భక్తుల పాదయాత్ర ఆధ్యాత్మికతకు, భక్తి భావానికి ప్రతీకగా నిలిచింది. వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తుల కోసం అన్నదానం, మంచినీటి సదుపాయాలను ఏర్పాటు చేశారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. ప్రకృతి రమణీయత మధ్య కొలువైన బైరాపూర్ విఠలేశ్వర ఆలయం రోజురోజుకూ ప్రముఖ పుణ్యక్షేత్రంగా అభివృద్ధి చెందుతోంది. స్వామివారి దర్శనం చేసుకుంటే మనసుకు ప్రశాంతత లభిస్తుందని భక్తులు విశ్వాసం వ్యక్తం చేశారు. "ప్రతి ఏడాది వైకుంఠ ఏకాదశి సందర్భంగా పాదయాత్రగా బైరాపూర్‌కు వచ్చి విఠలేశ్వర స్వామివారిని దర్శించుకోవడం మా కుటుంబానికి ఆనవాయితీగా మారింది. స్వామివారి దర్శనంతో ఎంతో ఆధ్యాత్మిక ఆనందం, మనశ్శాంతి కలుగుతోంది" అని భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన బైరాపూర్ విఠలేశ్వర స్వామివారి కృపాకటాక్షాలు అందరిపై ఉండాలని, ప్రతి ఇంటా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు వెల్లివిరియాలని భక్తులు ఆకాంక్షించారు.

## శ్రీవారి సేవలో ఎమ్మెల్యే దంపతులు.. ప్రత్యేక పూజలు

- భక్తుల సౌకర్యార్థం రూ.20 లక్షలతో మెట్ల మార్గం..
- రూ.50 లక్షలతో లైనింగ్ వాల్ నిర్మాణానికి భూమిపూజ...

బీర్కూర్, జూలై 25 (జన సంఘర్షణ):



ఆషాఢ మాసం తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామంలోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి దంపతులు శ్రీవెంకటేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం భక్తుల సౌకర్యార్థం కొండ కింది భాగం నుంచి ఆలయం వరకు కాలినడకన వచ్చే భక్తులకు మరింత సౌకర్యం కల్పించే ఉద్దేశంతో రూ.20 లక్షల వ్యయంతో మెట్ల మార్గం, రూ.50 లక్షల వ్యయంతో లైనింగ్ వాల్ నిర్మాణ పనులకు పోచారం శ్రీనివాస్ రెడ్డి దంపతులు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ ఆర్డీఓ రవీందర్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, బీర్కూర్, వర్ని మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. ఆషాఢ మాసం తొలి ఏకాదశి సందర్భంగా ఆలయానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## బాధితురాలి ఫిర్యాదుపై నిర్లక్ష్యం వహించిన కోరుట్ల ఎస్ఐ చిరంజీవి సస్పెన్షన్

నిజామాబాద్/జూలై 25/(జన సంఘర్షణ)



కోరుట్ల పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ చిరంజీవిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఇటీవల హత్యకు గురైన కర్రె సునీత గతంలో తనపై దాడి చేసిన వ్యక్తిపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినప్పటికీ, కేసు నమోదు చేయకుండా ఆయన నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణల నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించిన అనంతరం సస్పెన్షన్ నిర్ణయం తీసుకున్నారు. సకాలంలో చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడం వల్ల ఒక ప్రాణం బలైందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాగా, ఎస్ఐ చిరంజీవి గతంలో నిజామాబాద్ జిల్లా నందిపేట్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహించి, అనంతరం మెట్పల్లి ప్రాంతానికి బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఆయనపై తీసుకున్న ఈ సస్పెన్షన్ చర్య జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

## సమిష్టితత్వాన్ని ప్రోత్సహించటం ఎఫ్.పీ.వో లక్ష్యం

- నేరుగా విత్తే వరితో అధిక ఫలం
- కారేపల్లిలో ఎఫ్పీవో అవగాహన సదస్సులో అధికారులు

సింగరేణి ప్రతినిధి:(జన సంఘర్షణ)




సమిష్టి తత్వాన్ని ప్రోత్సహించటమే రైతు ఉత్పత్తిదారుల సంస్థ(ఎఫ్.పీ.వో) లక్ష్యమని కోఆపరేటీవ్ ట్రైనింగ్ సెంటర్ వైస్ ప్రిన్సిపాల్ రాజయ్య అన్నారు. శనివారం కారేపల్లిలో రైతు ఉత్పత్తిదారుల సంస్థ, కారేపల్లి సోసైటీ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు సంఘ అధ్యక్షులు దుగ్గినేని శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సదస్సులో వైస్ ప్రిన్సిపాల్ రాజయ్య మాట్లాడుతూ సాంకేతికను అందుకోవటంతో చిన్న సన్నకారు రైతులు వెనకబడటం మూలంగా ఉత్పత్తి తగ్గి పెట్టుబడ్ను పెరుగుతున్నాయన్నారు. సాంకేతికను అందించటం కోసం ప్రభుత్వం రైతు ఉత్పత్తిదారుల సంస్థను ఏర్పాటు చేసిందన్నారు. దీనిలో రూ.2వేలు కట్టి సభ్యత్వం తీసుకున్న రైతులకు ప్రభుత్వం మరో రూ.2వేలు వాటాగా కలుపుతుందన్నారు. వీటితో రైతులకు అవసరమైన సేవలను రైతు ఉత్పత్తిదారుల సంస్థ ద్వారా అందించటం జరుగుతుందన్నారు. ఎఫ్.పీ.వో లో 750 మంది సభ్యులు చేర్చుకునే అవకాశం ఉందన్నారు. కారేపల్లి సోసైటీలో 400 మంది సభ్యులుగా చేరి ఉన్నారని అది పని ప్రారంభించిందన్నారు. వ్యవసాయ శాస్త్రవేత డాక్టర్ కవిరాజ్ మాట్లాడుతూ వరిని నేరుగా విత్తే పద్దతి ద్వారా ఖర్చు తక్కువ, నీటి అవసరం తక్కువతో పాటు అధిక ఫలసాయం వస్తుందన్నారు. దీనిలో పంట కాలం 15 రోజు తగ్గుతుందన్నారు. రైతులుతమ భూముల షోషకాల స్థాయిని పరిశీలించి ఎరువులవాడకం చేయాలన్నారు. దానికి తప్పని సరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం భూసార పరీక్షల చేసే విధానాన్ని వివరించి కిట్ లను రైతులకు అందజేశారు. సమిష్టితత్వంపైరైతులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్.పీ.వో డొమైన్ ఎక్స్ పర్ట్ చావా అరుంధతి, సీఈవో బొల్లు హనుంతరావు, దిశ కమిటీ సభ్యురాలు దారావత్ హేమలత బాలాజీ, సర్పంచ్ లు అంగోత్ మత్రు, ఈసాల వెంకటేశ్వరరావు, భూక్య పద్మ, భూక్య రంజిత్ కుమార్, పూసం రామారావు, సోసైటీ డైరక్టర్లు అడ్డగోడ ఐలయ్య, డేగల ఉపేందర్, రైతు ప్రతినిధులు బానోత్ రాంమ్మూర్తి, కడియాల సుధాకర్, సురేందర్ మనియర్, కిలారి అప్పారావు, సూరపురెడ్డి విష్ణవర్ధన్ రెడ్డి, పెద్దబోయిన ఉమాశంకర్, ఆదెర్ల రాములు, అడపా పుల్లారావు, అజ్మీర నరేష్, కాసాని లక్ష్మినారాయణ, గడ్డం వెంకటేశ్వర్లు, పెర్ని వెంకటేశ్వర్లు, వడ్డె అనంతయ్య, ఈసాల ఛాయాదేవి, నాగండ్ల జగన్, అజ్మీర ఈర్యా, చాగంటి వెంకటేశ్వర్లు, అజ్మీర హేమ్లా, బట్టు సంగయ్య,ధళ్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

## దేశాన్ని అస్థిరపరిచే కుట్రలకు కేంద్ర ప్రభుత్వం తలవంచదు

- జాతీయ ప్రయోజనాల కోసం తీసుకున్న ప్రతి నిర్ణయానికి బీజేపీ అండగా నిలుస్తుంది.
- బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 25 (జన సంఘర్షణ)

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై కొందరు రాజకీయ పార్టీలు చేస్తున్న ప్రచారం పూర్తిగా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని తీవ్రంగా విమర్శించారు.దేశంలో అశాంతి, ఉద్రిక్తతలు, హింసాత్మక పరిస్థితులు సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని చూసే శక్తుల పట్ల కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం ఉపేక్ష చూపదని ఆయన స్పష్టం చేశారు. దేశ సమగ్రత, ప్రజల భద్రత, రాజ్యాంగ పరిరక్షణే మోదీ ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యత అని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం అధికారం కోసం కాదు,దేశ ప్రయోజనాల కోసం నిర్ణయాలు తీసుకుంటుందని రాగి రాములు పేర్కొన్నారు. అవసరమైతే రాజకీయంగా కఠినమైన నిర్ణయాలైనా తీసుకోవడానికి మోదీ ప్రభుత్వం వెనుకాడదని అన్నారు.కొన్ని రాజకీయ వర్గాలు విద్యార్థులు,యువత మరియు సామాన్య ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టి దేశంలో ఉద్రిక్త పరిస్థితులు సృష్టించాలని ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ప్రజలు అలాంటి రాజకీయ ప్రేరేపిత ప్రచారాలను నమ్మకుండా అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. గతంలో వ్యవసాయ చట్టాల విషయంలో కూడా ప్రధానమంత్రి దేశ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇచ్చారని గుర్తు చేసిన రాగి రాములు, దేశ శాంతి భద్రతలను కాపాడడం కోసం తీసుకునే ప్రతి నిర్ణయం జాతీయ ప్రయోజనాల దృష్టితోనే ఉంటుందని అన్నారు.భారతదేశాన్ని అస్థిరపరిచే ప్రయత్నాలు ఎవరైనా చేసినా,చట్టం తన పని తాను చేస్తుందని, దేశ భద్రతకు విఘాతం కలిగించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.ప్రజలు పుకార్లు, అసత్య ప్రచారాలు, రాజకీయ రెచ్చగొట్టింపులకు లోనుకాకుండా దేశ అభివృద్ధికి, శాంతి భద్రతలకు సహకరించాలని రాగి రాములు విజ్ఞప్తి చేశారు.దేశం



ముందు పార్టీ తర్వాత. ప్రజల భద్రత ముందు రాజకీయాలు తర్వాత. ఇదే నరేంద్ర మోదీ ప్రభుత్వ విధానం అని రాగి రాములు పేర్కొన్నారు.

## హైకోర్టు న్యాయమూర్తులకు ఘన స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి బ్యూరో / జూలై 25 (జనసంఘర్షణ):







కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో రెండు రోజుల పర్యటనకు విచ్చేసిన తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులకు కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ శనివారం జిల్లా కేంద్రంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ లక్ష్మీనారాయణ, జస్టిస్ ప్రవీణ్ కుమార్, జస్టిస్ మాధవీలతలకు జిల్లా కలెక్టర్ పూల మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. హైకోర్టు న్యాయమూర్తులు శనివారం, ఆదివారం రెండు రోజులపాటు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా వారు పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

## అంతర్జాతీయ స్థాయి కి ఎం.జె.పి.టి.బి.సి.డబ్ల్యు.ఆర్. విద్యార్థిని ప్రతిభ

కామారెడ్డి బ్యూరో./జూలై 25/( జనసంఘర్షణ)

కామారెడ్డి అజంపుర లో గల మహాత్మా జ్యోతిబా పూలే బాలికల విద్యాలయం లో పదవ తరగతి చదువుతున్న ఎస్. రిశ్విత అనే విద్యార్థిని అంతర్జాతీయ స్థాయిలో పోటీలకు ఎంపికైంది. ఈ నెల 30 నుండి ఆగస్టు 7, 2026 వరకు జరగనున్న ఇంటర్నేషనల్ ఛాంపియన్షిప్ – 2026 లో స్థానం సంపాదించి, పోటీలకు సిద్ధం అయినది. బిక్నూర్ కు చెందిన ఎస్. శ్రీకాంత్ పద్మ ల కుమార్తె అయిన రిశ్విత ది యాచ్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో శిక్షణ పొంది అంతర్జాతీయ వేదిక పై భారత దేశానికి ప్రాతినిధ్యం వహించనున్నది. ఈ అరుదైన అవకాశం ప్రతిభతో సాధించి తెలంగాణకు కీర్తిని తెచ్చింది. అంతర్జాతీయ మెడల్స్ సాధించేందుకు ప్రయత్నిస్తామని మాట ఇస్తున్నది. విద్యార్థిని యొక్క ప్రతిభను గుర్తించి, అన్నిరకాల సదుపాయాలు సొసైటీ తరపున ఎం.జె.పి.టి.బి.సి.డబ్ల్యు.ఆర్. సెక్రటరీ బి. సైదులు సమకూర్చి, అంతర్జాతీయ స్థాయికి ఎదిగేలా సహకరించారని ప్రిన్సిపాల్ పి.మాధవి సెక్రటరీ సైదులు కి కృతజ్ఞతలు తెలిపారు.గతం లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో అద్భుత ప్రతిభ ప్రదర్శించి గోల్డ్, సిల్వర్ పతకాలను గెలుచుకుని ఇప్పుడు అంతర్జాతీయ పోటీల్లో స్థానం దక్కించుకోవడం సంతోషంగా ఉందని ఈ సందర్భంగా బి.సి. వెల్ఫేర్ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ , సెక్రటరీ బి. సైదులు , ప్రిన్సిపాల్ సెక్రటరీ బాల మాయా దేవి , ఆర్.సీ.ఓ సత్యనాథ్ రెడ్డి ప్రిన్సిపాల్ పి.మాధవి విద్యార్థినిని అభినందించారు. అమ్మాయి ఇలాగే పట్టుదలతో, కృషితో దేశానికి మరిన్ని ఎన్నో ప్రశంసలు తీసుకురావాలని ఆకాంక్షించారు.




# నీట్ పేపర్ లీక్ కేసులో సంచలన పరిణామం

- విద్యార్థుల ఉద్యమానికి విజయం..
- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా....

న్యూఢిల్లీ,/ జూలై 25:/(జన సంఘర్షణ)
దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసిన నీట్–యూజీ పేపర్ లీక్, పరీక్షల నిర్వహణలో అవకతవకల వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. విద్యార్థుల భవిష్యత్తు, పరీక్షల విశ్వసనీయతపై నెలకొన్న ఆందోళనల నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

**విద్యార్థుల పోరాటానికి ఫలితం.. సోషల్ మీడియాలో హర్షం....**

నీట్ పరీక్షల్లో అవకతవకలు, పేపర్ లీక్ ఆరోపణలపై దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువజన సంఘాలు చేపట్టిన నిరసనలు చివరకు కీలక మలుపు తిప్పాయి. పరీక్షా విధానంలో పారదర్శకత తీసుకురావాలని, విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ సహా పలు ప్రాంతాల్లో విద్యార్థులు ఆందోళనలు నిర్వహించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలన్న డిమాండ్ కూడా ఈ నిరసనల్లో ప్రధానంగా వినిపించింది. తాజాగా ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో విద్యార్థుల పోరాటం విజయవంతమైందంటూ సోషల్ మీడియాలో పలువురు విద్యార్థులు, యువత


धर्मेन्द्र प्रधान
DHARMENDRA PRADHAN

शिक्षा मंत्री
भारत सरकार
नई दिल्ली-110001
MINISTER OF EDUCATION
GOVERNMENT OF INDIA
NEW DELHI-110001

D.O. No. MoE/Min/2025/07/21/01

21st July, 2025

To,
The Hon'ble President of India
Rashtrapati Bhavan
New Delhi – 110004

Subject: Resignation from the Office of the Union Minister of Education

Respected Rashtrapati Ji,

I, Shri Dharmendra Pradhan, hereby tender my resignation from the office of the Union Minister of Education, Government of India, with immediate effect.

It has been an honour and a privilege to serve the nation and contribute towards the development of India's education sector. I am deeply grateful to the Hon'ble Prime Minister, my colleagues in the Council of Ministers, and all officials for their support and cooperation during my tenure.

I remain committed to the service of the nation in whatever capacity the Hon'ble Prime Minister may deem fit in the future.

With regards,

Yours sincerely,
(Dharmendra Pradhan)
Minister of Education
Government of India

Copy to:
The Hon'ble Prime Minister of India
South Block
New Delhi – 110011

FICTIONAL SAMPLE – CREATED FOR ILLUSTRATIVE PURPOSES ONLY

హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ హక్కుల కోసం శాంతియుతంగా సాగించిన పోరాటానికి ఇది విజయంగా అభివర్ణిస్తూ పోస్టులు, సందేశాలు వైరల్ అవుతున్నాయి.

**నిందితులపై కఠిన చర్యలకు కేంద్రం సిద్ధం..**

ఇదిలా ఉండగా, నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రధాన నిందితులు, వారికి సహకరించిన వారిపై కఠిన చర్యలు తీసుకునే దిశగా దర్యాప్తు కొనసాగుతోంది. ఈ వ్యవహారంలో బాధ్యులైన ప్రతి ఒక్కరిపై చట్టపరమైన



చర్యలు తీసుకోవడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా దేశవ్యాప్తంగా పోటీ పరీక్షల నిర్వహణ విధానంలో సమగ్ర సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.


**విద్యార్థుల భవిష్యత్తే ముఖ్యం......**

విద్యార్థుల భవిష్యత్తు, పరీక్షల పారదర్శకత, విద్యా వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని పునరుద్ధరించడమే ఇప్పుడు ప్రధాన సవాలుగా మారింది. ఈ పరిణామం నేపథ్యంలో విద్యార్థుల పోరాటానికి న్యాయం జరిగిందని, ఇకపై పోటీ పరీక్షల్లో పారదర్శకత, జవాబుదారీతనం మరింత పెరగాలని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఊరూరా విస్తృత స్థాయిలో 'జలసిరి' కార్యక్రమాలు చేపట్టాలి

- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

నిజామాబాద్,/ జూలై 25/ (జనసంఘర్షణ):
ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'తెలంగాణ జలసిరి' కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో విస్తృత స్థాయిలో అమలు చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) సూచించారు. శనివారం అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు), డీఆర్‌డీఓలు, జెడ్పీ సీఈఓలు, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, ఎంపీడీఓలతో మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సెర్ప్ సీఈఓ దివ్యదేవరాజన్‌తో కలిసి నిర్వహించిన ఈ సమీక్షలో గ్రామాల్లో చేపట్టాల్సిన నీటి సంరక్షణ పనులపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రస్తుత ప్రతికూల పరిస్థితుల్లో వీబీజీ రామ్–జీ పథకం కింద గ్రామాల్లో ఇంకుడు గుంతలు, ఊట కుంటలు, పంట కుంటలు, బోరుబావుల రీఛార్జ్ నిర్మాణాలను విస్తృతంగా చేపట్టి కూలీలకు ఉపాధి కల్పించాలని మంత్రి సూచించారు. గ్రామ సభలను నిర్వహించి ఈ పనుల ఆవశ్యకతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, ఆగస్టు 15వ తేదీ నాటికి అన్ని గ్రామాల్లో పనులు పూర్తయ్యేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రానున్న రోజుల్లో నీటి కొరతను ఎదుర్కొనేందుకు ప్రతి వర్షపు చుక్కను భూమిలోకి ఇంకించి భూగర్భ జలాలను పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం వీబీజీ రామ్–జీ పథకం కింద నీటి సంరక్షణ పనులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా క్షేత్రస్థాయిలో జలసిరి కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేయాలని సూచించారు. జలసిరి పనుల పర్యవేక్షణ కోసం మండల స్థాయిలో గ్రామీణ నీటి సరఫరా ఏఈ, పంచాయతీరాజ్ ఏఈ, ఎంపీడీఓ, ఎంపీఓ, ఏపీఓలతో కమిటీ ఏర్పాటు చేసి పనులను నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ప్రతి గ్రామంలో పండగ వాతావరణంలో జలసిరి కార్యక్రమాలు నిర్వహించాలని, అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో సమిష్టిగా కృషి చేయాలని అన్నారు. కూలీలకు చేతినిండా పని కల్పించడంతో పాటు పనిదినాల లక్ష్యాన్ని సాధించి, అందుబాటులో ఉన్న నిధులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా అధికారులు చొరవ చూపాలని సూచించారు. వీబీజీ రామ్–జీ పథకం కింద 318 రకాల పనులు చేపట్టే అవకాశం ఉన్నప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో భూగర్భ జలాల పెంపునకు దోహదపడే జలసిరి కార్యక్రమాల అమలుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. అదేవిధంగా వన మహోత్సవంలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలు





నాటాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్రామ సభల్లో చర్చించి నిర్ణయించే ప్రతి పని ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా చూడాలని మంత్రి సీతక్క సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) గిరి, జెడ్పీ సీఈఓ చందర్, డీఆర్‌డీఓ దామోదర్ రెడ్డి, డీపీఓ మురళి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థుల నిరసనల్లో బీజేపీ మంత్రి కూతురు..

- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్
- గౌహతి: అస్సాంలో అధికారంలో ఉన్న బీజేపీకి....

అస్సాం/జూలై 25/(జన సంఘర్షణ)
ఊహించని చేదు అనుభవం ఎదురైంది. అస్సాం ప్రభుత్వంలో సీనియర్ మంత్రి అయిన రెవెన్యూ శాఖా మంత్రి కేశబ్ మహంత కూతురు దిబిసా మహంత నిరసనల్లో కనిపించి అందరి దృష్టిని ఆకర్షించింది. గురువారం గౌహతిలోని చచల్లో జరిగిన విద్యార్థుల నిరసనలో ఈ బీజేపీ మంత్రి కూతురు భాగం కావడం విశేషం. పేపర్ లీక్ కు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి పదవికి బీజేపీ నేత ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్ దేశవ్యాప్తంగా నిరసనలు జరుగుతున్నట్టే అస్సాంలో కూడా జరిగాయి.
ఈ నిరసనల్లో ఒక బీజేపీ మంత్రి కూతురు ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, విద్యార్థులకు న్యాయం జరగాలని నినాదాలు చేయడం చర్చనీయాంశమైంది. ఆమె నిరసన తెలిపిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అస్సాంలో బీజేపీ ప్రభుత్వం, మరీ ముఖ్యంగా సదరు మంత్రి చిక్కుల్లో పడ్డారు. బీజేపీ మంత్రి కూతురు ఈ నిరసనల్లో పాలు పంచుకోవడంపై అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ స్పందించారు. నిరసన తెలిపే విద్యార్థుల హక్కును




ప్రభుత్వం గౌరవిస్తుందని చెప్పారు. ఈ నిరసన విద్యార్థుల నుంచి వ్యక్తమైందని.. వారి డిమాండ్లను గౌరవించి ప్రధాన మంత్రి ఈ విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారని సీఎం చెప్పారు.

**ధర్మేంద్ర ప్రధాని. రాజీనామాకు రంగం సిద్ధం..? : కాక్రోచ్ పార్టీతో..**

**మరోసారి కేంద్రం చర్చలు....**

ఇదిలా ఉండగా.. ఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర యువత చేస్తున్న నిరసన తారా స్థాయికి చేరింది. రోజురోజుకూ ఈ ఆందోళనలు ఉధృతమవుతున్నాయి. శాంతియుతంగా నిరసన తెలుపుతుండటంతో పోలీసులు కూడా యువత నిరసనలకు అడ్డు పడే సాహసం చేయడం లేదు. లాఠీ ఛార్జ్ కారణంగా ఢిల్లీ పోలీసు శాఖ తీవ్ర విమర్శల పాలైంది. అందుకే.. పోలీసులు ఈ నిరసనలపై ఆచితూచి అడుగులేస్తున్నారు. ఢిల్లీలోని అధికార యంత్రాంగం.. ఇప్పటికే ఢిల్లీలోని మెట్రో స్టేషన్లను మూసివేస్తూ యువత ఢిల్లీకి రాకుండా.. వచ్చినా జంతర్ మంతర్కు రాకుండా ప్రయత్నం చేస్తుంది. ఇంటర్నెట్ పై ఇప్పటికే ఆంక్షలు కొనసాగుతున్నాయి.

# కాలనీల్లో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్న పోచారం!

బాన్సువాడ/జూలై 25/(జన సంఘర్షణ)



బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి వివిధ కాలనీల్లో పర్యటించి, ఆర్డీఓ రవీందర్ రెడ్డి సమక్షంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండల కేంద్రంలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి సమస్యలు తెలుసుకుంటూ వివిధ కాలనీల్లో పర్యటించారు.ఇండ్లు లేని వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి ఇస్తామని హామీ ఇచ్చారు.సమస్యలు ఎమున్న ప్రజలు తమ దృష్టికి తేవాలని అన్నారు పోచారం. ఆయన వెంట స్తానిక ఆర్ డీ ఓ రవీందర్ రెడ్డి,తహసీల్దార్ రాజా నరేందర్ గౌడ్ లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

# ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖ.. నేపథ్యమిదే!

- కర్ణాటకకు చెందిన సీనియర్ బీజేపీ నేత..
- ఐదుసార్లు ధార్వాడ్ లోక్‌సభ నుంచి విజయం...

న్యూఢిల్లీ, జూలై 25 (జన సంఘర్షణ):



కేంద్ర విద్యాశాఖ బాధ్యతలు స్వీకరించిన ప్రహ్లాద్ జోషి కర్ణాటకకు చెందిన సీనియర్ బీజేపీ నాయకుడు. బీఏ ఆర్ట్స్‌లో విద్యాభ్యాసం పూర్తి చేసిన ఆయన, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)తో అనుబంధం కలిగి రాజకీయాల్లోకి ప్రవేశించారు. తొలుత ధార్వాడ్ జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా పనిచేశారు. ప్రహ్లాద్ జోషి 2004, 2009, 2014, 2019, 2024 లోక్‌సభ ఎన్నికల్లో ధార్వాడ్ నియోజకవర్గం నుంచి వరుసగా విజయం సాధించారు. ప్రస్తుతం కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అంతకుముందు 2019 నుంచి 2024 వరకు బొగ్గు, గనులు, పార్లమెంటరీ వ్యవహారాల శాఖల మంత్రిగా పనిచేశారు. అలాగే కర్ణాటక బీజేపీ అధ్యక్షుడిగా కూడా పార్టీకి సేవలందించారు. తాజాగా కేంద్ర విద్యాశాఖ బాధ్యతలు అదనంగా అప్పగించడంతో ప్రహ్లాద్ జోషి మరో కీలక బాధ్యతను చేపట్టారు.

# బోనాల మహోత్సవానికి మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మదేవేందర్ రెడ్డికి ఆహ్వానం

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 25 (జన సంఘర్షణ)



మెదక్ పట్టణ ముదిరాజ్ సంఘం, బోనాల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 2న నల్లపోచమ్మ అమ్మవారికి బోనాల మహోత్సవం,ఆగస్టు 3న పలహారం బండి కార్యక్రమంనిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మదేవేందర్ రెడ్డిని శనివారం వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి బోనాల మహోత్సవ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఉత్సవాలకు విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం, బోనాల ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజా పోరాటం ముందు ఎవరైనా తలవంచాల్సిందే

- విద్యార్థి లోకం సాధించిన నైతిక విజయమిది: టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్

నిజామాబాద్, జూలై 25 (జనసంఘర్షణ):



ప్రజాస్వామ్యంలో ప్రజా పోరాటాల ముందు ఎవరైనా తలవంచక తప్పదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ప్రజల ఆకాంక్షలు, విద్యార్థుల న్యాయమైన డిమాండ్ల ముందు కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. గతంలో రైతు చట్టాలను వెనక్కి తీసుకోవడం, ప్రస్తుతం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం ప్రజా ఉద్యమాల శక్తికి నిదర్శనమని ఆయన అన్నారు. తాజా పరిణామం విద్యార్థి లోకం సాధించిన నైతిక విజయమని అభివర్ణించారు. విద్యార్థుల న్యాయమైన పోరాటానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అందించిన మద్దతు, చేసిన కృషి కీలకమని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ప్రజా ఉద్యమాలను అణచివేయాలని చూసినా, చివరికి ప్రజల పోరాటాల ముందు ప్రభుత్వాలు తమ నిర్ణయాలను పునరాలోచించక తప్పదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల గొంతే అంతిమంగా విజయం సాధిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

# హైదరాబాద్లో ఉంటే ఇక్కడి సమస్యలు ఎలా పరిష్కారమవుతాయి..

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్.వీరయ్య...



గోదావరిఖని//జూలై 25/(జన సంఘర్షణ)

గోదావరిఖని ప్రభుత్వాసుపత్రికి వెళ్లి ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు పబ్లిసిటీ చేసుకుని సోషల్ మీడియాలో ప్రచారం చేసుకోవడం కాదు... ఆసుపత్రిలో సౌకర్యాలు మెరుగుపరిచి ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించినప్పుడే ఆసుపత్రి అభివృద్ధి చెందుతుంది అనే విషయాన్ని గుర్తుంచుకోవాలని పలువురు హితవు పలుకుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ హైదరాబాద్లో ఉంటే గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రిలోని సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్. వీరయ్య ప్రశ్నించారు. సీపీఎం పెద్దపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం గోదావరిఖనిలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వివిధ వార్డులను పరిశీలించి, అనంతరం ఆర్ఎంఓ ఇన్చార్జి డాక్టర్ కృపాబాయిని కలిసి ఆస్పత్రిలోని మౌలిక వసతులు, శానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ సిబ్బంది సమస్యలు, వైద్య సేవలపై చర్చించారు. అనంతరం ఎస్. వీరయ్య మాట్లాడుతూ, మూడు జిల్లాల నుంచి రోజూ సుమారు 1,500 మందికి పైగా రోగులు ఈ ఆస్పత్రికి వస్తున్నప్పటికీ వారికి తగిన సౌకర్యాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. రోగులు,వారి సహాయకుల కోసం కనీస బాత్రూమ్ సదుపాయాలు కూడా లేవని, వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి ప్రాంతంలో దుమ్ము,ధూళి ప్రభావంతో కిడ్నీ సంబంధిత వ్యాధులు అధికంగా వస్తున్నప్పటికీ ఆస్పత్రిలో నెఫ్రాలజిస్టు (కిడ్నీ వైద్యుడు) లేకపోవడం బాధాకరమన్నారు. అలాగే ఎంఆర్ఐ స్కానింగ్ సౌకర్యం లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఎంఆర్ఐ యంత్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. 250మంది వైద్యులు ఉండాల్సిన ఆస్పత్రిలో కేవలం సుమారు 100 మంది మాత్రమే పనిచేస్తున్నారని, వైద్యుల కొరత కారణంగా రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందడం లేదన్నారు. 13 మంది ఉన్నతాధికారుల పోస్టుల్లో ఐదు మాత్రమే భర్తీ అయ్యాయని, ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. 350 మంది నర్సులకు ఒకే బాత్రూమ్ ఉండటం, ప్రతి అంతస్తులో ఒక చిన్న విశ్రాంతి గది మాత్రమే ఉండటం దురదృష్టకరమన్నారు. పనిచేయని లిఫ్ట్ కారణంగా రోగులను పై అంతస్తులకు తరలించడం తీవ్ర ఇబ్బందిగా మారిందని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. లిఫ్ట్ పక్కనున్న తాగునీటి ఫ్రిజ్ కూడా పనిచేయడం లేదని, దానిని కూడా అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. పేషెంట్ కేర్, శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బందికి 15 రోజులకు ఒకసారి డ్యూటీలు మార్చడం సరైన విధానం కాదని, వారానికోసారి మార్పులు చేయాలని సూచించారు. రెండు, మూడు నెలలకు ఒకసారి జీతాలు చెల్లించడం వల్ల కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రతి నెలా క్రమం తప్పకుండా వేతనాలు చెల్లించాలని, అవసరమైన మేరకు మ్యాన్పవర్ను పెంచాలని డిమాండ్ చేశారు. ఏఎన్సీ స్కానింగ్ విభాగం వద్ద తాగునీటి సౌకర్యం లేకపోవడంతో రోగులు బయటకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొన్నదన్నారు. ఆస్పత్రిలో మందుల కొరత తీవ్రంగా ఉండటంతో సగం మందులు బయట కొనాల్సి వస్తోందని, అవసరమైన మందులను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలని కోరారు. రోగుల సహాయకుల కోసం కేటాయించిన ప్రదేశాన్ని డంపింగ్ యార్డ్ మార్చి చెత్త, విరిగిపోయిన బెడ్లు, కుర్చీలు వేయడం సరికాదన్నారు. వార్డులలోని బాత్రూమ్లు అపరిశుభ్రంగా ఉండటంతో పాటు నీటి సరఫరా లేక రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మూడు అంతస్తుల భవనంలో లీకేజీల కారణంగా మురుగు నీరు నిల్వ ఉండి దోమలు, ఈగలు పెరిగి దుర్వాసన వస్తోందన్నారు. ఆస్పత్రి వెనుక నిర్మించిన ఆరు బాత్రూమ్లకు నెలలుగా తాళాలు వేసి ఉంచడం వల్ల అవి వినియోగానికి నోచుకోవడం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక వసతులు, సరిపడా వైద్యులు, మందులు, పారిశుద్ధ్య సదుపాయాలు కల్పించి పేదలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని ఎస్. వీరయ్య హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ. ముత్యంరావు, వేల్పుల కుమారస్వామి, ఎం. రామాచారి, సీనియర్ నాయకుడు టి. రాజారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఎన్. బిక్షపతి, ఎం. శ్రీనివాస్, జి. జ్యోతి, శైలజ, నాయకులు శివరాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బాన్సువాడలో ఘనంగా శ్రీ రామ నామస్మరణ గురు వందనం

- భక్తిశ్రద్ధలతో పాల్గొన్న పోచారం కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు, భక్తులు





బాన్సువాడ/, జూలై 25/ (జన సంఘర్షణ):

బాన్సువాడ పట్టణంలోని తన నివాసం వద్ద తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం శ్రీ సద్గురు స్వామి సమర్థ మహారాజ్చే శ్రీ రామ నామస్మరణ గురు వందనం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ రామ నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. స్వామివారి ఆశీస్సులు పొందేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో పోచారం కుటుంబ సభ్యులు పోచారం శంభు రెడ్డి-ప్రేమల దంపతులు, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి-సోని రెడ్డి దంపతులు, పోచారం సురేందర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు, గురు వందన కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే బాన్సువాడ నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, కార్యకర్తలు, శ్రీ సద్గురు స్వామి సమర్థ మహారాజ్ వారి భక్తులు పెద్ద ఎత్తున హాజరై ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. భక్తి, ఆధ్యాత్మికత, గురుభక్తి కలగలిసిన ఈ కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. శ్రీ రామ నామస్మరణతో బాన్సువాడ పట్టణంలో భక్తి భావం వెల్లివిరిసింది.

# సర్పంచ్ భర్త పెత్తనంపై వార్డు సభ్యుల తిరుగుబాటు

కామారెడ్డి/జూలై 25 (జన సంఘర్షణ):

మహిళల రాజకీయ సాధికారత కోసం రాజ్యాంగం గ్రామపంచాయతీల్లో కల్పించిన రిజర్వేషన్లు కొన్ని చోట్ల అభాసుపాలవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామ పరిపాలనలో మహిళలు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునేలా చట్టాలు ఉన్నప్పటికీ, కొన్ని గ్రామాల్లో మహిళా సర్పంచుల స్థానంలో వారి భర్తలే అధికార వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారనే విమర్శలు తరచూ వెలువడుతున్నాయి. తాజాగా కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలంలోని ఓ తండా గ్రామంలో సర్పంచ్ భర్త జోక్యం అధికమైందని ఆరోపిస్తూ పలువురు వార్డు సభ్యులు మండల, జిల్లా స్థాయి అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడం చర్చనీయాంశంగా మారింది.

**వార్డు సభ్యుల ఆరోపణలు ఇవే..**



ఫిర్యాదు పత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం.. గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక ఛాంబర్ ఏర్పాటు చేసుకుని సర్పంచ్కు బదులుగా ఆమె భర్త అక్కడ కూర్చొని పరిపాలనా వ్యవహారాలను నిర్వహిస్తున్నారని వార్డు సభ్యులు ఆరోపించారు. సర్పంచ్ భర్తతో పాటు ఆమె ఇద్దరు కుమారులు కూడా గ్రామపంచాయతీ వ్యవహారాల్లో అజమాయిషీ చేస్తున్నారని పేర్కొన్నారు. గ్రామంలో చేపట్టే అభివృద్ధి పనులు, వివిధ నిర్ణయాలు, బిల్లుల వ్యవహారాలు, అధికారులతో సమావేశాలు తదితర అంశాలను సర్పంచ్ భర్తే చూసుకుంటున్నారని వార్డు సభ్యులు ఆరోపించారు. గ్రామపంచాయతీ సమావేశాల్లో సైతం సర్పంచ్ భర్తే నిర్ణయాలు తీసుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. మహిళా సర్పంచ్ అధికారాలను పక్కనపెట్టి ఆమె భర్త జోక్యం చేసుకోవడంపై చర్యలు తీసుకోవాలని, గ్రామపంచాయతీ పరిపాలన రాజ్యాంగ నిబంధనలు, పంచాయతీరాజ్ చట్టం ప్రకారం సక్రమంగా జరిగేలా చూడాలని వార్డు సభ్యులు అధికారులను కోరినట్లు తెలిసింది. ఈ ఫిర్యాదుపై అధికారులు విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ప్రజాస్వామ్య విజయం

- రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ
- జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీజ్యోతి భీమ్ భరత్



రంగారెడ్డి జిల్లా/జూలై 25 (జనసంఘర్షణ):

నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంలో దేశవ్యాప్తంగా యువత, విద్యార్థులు చేపట్టిన అలుపెరగని పోరాటానికి కేంద్ర ప్రభుత్వం దిగివచ్చిందని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం ప్రజాస్వామ్య విజయం అని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీజ్యోతి భీమ్ భరత్ పేర్కొన్నారు. బడంగ్పేట మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన విజయోత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లా నరసింహారెడ్డి మాట్లాడుతూ.. విద్యాశాఖలో చోటుచేసుకున్న అవకతవకలపై దేశవ్యాప్తంగా జరిగిన ప్రజా పోరాటానికి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం యువత సాధించిన విజయమని అన్నారు. ఈ పోరాటంలో భాగస్వాములైన విద్యార్థులు, యువతకు ఆయన అభినందనలు తెలిపారు. శ్రీజ్యోతి భీమ్ భరత్ మాట్లాడుతూ.. నీట్ విద్యార్థుల సమస్యలపై పోరాటం చేస్తూ వారికి నైతిక మద్దతు అందించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల పోరాట స్ఫూర్తి తమకు ఆదర్శమని అన్నారు. వారి స్ఫూర్తితో ప్రజా సమస్యలపై మరింత బలంగా పోరాడుతామని, కేంద్ర ప్రభుత్వ విధానాల్లోని అవకతవకలను ప్రజా ఉద్యమాల ద్వారా ఎండగడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ అధ్యక్షులు, మాజీ బడంగ్పేట మున్సిపల్ మేయర్, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బాల్కొండ కోర్స్ డైరెక్టరుపై చర్యలు తీసుకోవాలి

- ఎస్సీఈఆర్టీ శిక్షణలో అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలి:
- పీఆర్టీయూ తెలంగాణ జిల్లా గౌరవ అధ్యక్షులు కృపాల్ సింగ్ సోడి



బాల్కొండ/జూలై 25:

జిల్లాలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఎస్సీఈఆర్టీ శిక్షణ కార్యక్రమాల్లో చోటుచేసుకున్న అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పీఆర్టీయూ తెలంగాణ జిల్లా గౌరవ అధ్యక్షులు కృపాల్ సింగ్ సోడి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 13, 14, 15 తేదీల్లో బాల్కొండలో నిర్వహించిన సాంఘిక శాస్త్రం శిక్షణ కార్యక్రమంలో విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందించాల్సిన నోటుబుక్స్ను ఉపాధ్యాయులకు పంపిణీ చేసినట్లు ఆయన ఆరోపించారు. విద్యా సంవత్సరం ప్రారంభంలో పేద విద్యార్థులకు చేరాల్సిన విద్యా సామగ్రిని శిక్షణ కార్యక్రమాలకు వినియోగించడం ప్రభుత్వ ఉద్దేశాలకు విరుద్ధమని పేర్కొన్నారు. అంతేకాకుండా శిక్షణ కార్యక్రమాల్లో నాణ్యతలేని సామాగ్రిని వినియోగించడంతో పాటు, శిక్షణ పేరుతో నిధుల దుర్వినియోగం జరుగుతోందని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంపై సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. అవకతవకలకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, బాల్కొండ కోర్స్ డైరెక్టరుపై తక్షణమే చర్యలు తీసుకుని సస్పెండ్ చేయాలని కృపాల్ సింగ్ సోడి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# బోధన్లో రోడ్డు ప్రమాదం.. ఒకరు మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు.. కేసు నమోదు: సీఐ వెంకట నారాయణ


బోధన్/జూలై 25: /(జన సంఘర్షణ)




బోధన్ పట్టణంలోని బొర్రా గణపతి మందిరం బైపాస్ జంక్షన్ వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. రాకాసిపేటకు చెందిన శ్రావణ్ (35) మృతి చెందగా, అతనితో ఉన్న రాకేశ్ తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన రాకేశ్ను మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ట్రాక్టర్ ఢీకొనడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు మృతుడు శ్రావణ్ తండ్రి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారని పోలీసులు తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బోధన్ సీఐ వెంకట నారాయణ వెల్లడించారు.

# బాన్సువాడ-కోటగిరి మండల సోషల్ మీడియా ఇంచార్జ్గా కర్నె భూపేందర్ పటేల్


కోటగిరి, జూలై 25(జన సంఘర్షణ):




కోటగిరి మండల కేంద్రానికి చెందిన కర్నె భూపేందర్ పటేల్ను బాన్సువాడ-కోటగిరి మండల సోషల్ మీడియా ఇంచార్జ్గా నియమించారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు మున్నూరు కాపు నాయకులు, యువకులు, అభిమానులు అభినందనలు తెలిపారు. మున్నూరు కాపుల ఐక్యత, అభ్యున్నతి కోసం గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయడంతో పాటు బస్తీ స్థాయిలో సోషల్ మీడియా కమిటీలను కూడా ఏర్పాటు చేసి, సమాజాన్ని మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. మున్నూరు కాపుల ఆర్థిక, సామాజిక, రాజకీయ అభివృద్ధితో పాటు రిజర్వేషన్ల సాధన కోసం చేపడుతున్న పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని కోరారు. సోషల్ మీడియా ద్వారా మున్నూరు కాపుల సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లి, హక్కుల సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్కరికీ కర్నె భూపేందర్ పటేల్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ మున్నూరు కాపుల ఐక్యత, అభ్యున్నతి కోసం తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

# అపార్ట్మెంట్ టెర్రస్పై నుంచి దూకిన యువతి మృతి

మేడ్చల్/జూలై 25 (జన సంఘర్షణ):



మేడ్చల్ జిల్లా నాగారం పరిధిలో శుక్రవారం సాయంత్రం విషాద ఘటన చోటు చేసుకుంది. అపార్ట్మెంట్ ఐదో అంతస్తు టెర్రస్పై నుంచి దూకడంతో తీవ్రంగా గాయపడిన యువతి చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలిని వడ్లకొండ ఆనందచారి, అరుణ దంపతుల కుమార్తె దీక్షిత (26)గా గుర్తించారు. ఘటన జరిగిన వెంటనే ఆమెను తీవ్ర గాయాలతో ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
ఆదివారం
26 జులై 2026

## ఆల్ ఇండియా పంచాయత్ పరిషత్ జాతీయ కార్యదర్శిగా పి.సత్యనారాయణ నియామకం

**దక్షిణాది రాష్ట్రాల డిసిప్లినరీ యాక్షన్ కమిటీ చైర్మన్గా అదనపు బాధ్యతలు**



**హైదరాబాద్ :**
ఆల్ ఇండియా పంచాయత్ పరిషత్ (AIPP) జాతీయ అధ్యక్షుడు డా. అశోక్ చౌహాన్ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రానికి చెందిన శ్రీ పి. సత్యనా రాయణను ఆల్ ఇండియా పంచాయత్ పరిషత్ జాతీయ కార్యదర్శిగా నియమిస్తూ ఉత్తర్వు లు జారీ చేశారు. జయప్రకాశ్ నగర్, హైదరాబాద్కు చెందిన పి. సత్యనారాయణకు జాతీయ కార్యదర్శి పదవితో పాటు ఆం ధ్రప్రదేశ్, తెలంగాణ, తమి ళనాడు, కర్ణాటక, కేరళ, లక్ష ద్వీప్, పుదుచ్చేరి రాష్ట్రాల డిసి ప్లినరీ యాక్షన్ కమిటీ చైర్మన్గా అదనపు బాధ్యతలను కూడా సంస్థ అప్పగించింది. ఈ సందర్భంగా శ్రీ పి. సత్యనా రాయణ మాట్లాడుతూ, సంస్థ లక్ష్యాల సాధనకు, మహాత్మా గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య సాకారానికి మరింత సమర్థవంతంగా కృషి చేస్తానని తెలిపారు. పంచా యతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు గ్రామీణాభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన జాతీయ నాయకత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పి. సత్యనారాయణ నియామకాన్ని పురస్కరించుకుని ఆల్ ఇండియా పంచాయత్ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు దయాన్పాల్ సింగ్, దక్షిణాది రాష్ట్రాల సమన్వయకర్త వి.ఎస్. విజయ్ వర్మ పాకల పాటి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జలీల్ హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు. ఆయన నాయకత్వంలో సంస్థ దక్షిణాది రాష్ట్రాల్లో మరింత బలోపేతం అవు తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

## డ్రగ్స్,సైబర్ నేరాలపై విస్తృత అవగాహన కార్యక్రమం

**-మాదకద్రవ్యాలు,ఆన్లైన్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఉప్పల్ పోలీసులు**




**ఉప్పల్ :**
యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడడంతో పాటు సైబర్ నేరాలపై ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు ఉప్పల్ పోలీసులు శనివారం ఉప్పల్ స్కైవాక్ వద్ద డ్రగ్స్ అవగాహన, సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల్ పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓ రామలింగరెడ్డి మాట్లాడుతూ,.మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని, డ్రగ్స్కు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. అలాగే రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, నకిలీ వెబ్సైట్లు, అనుమానాస్పద లింకులను నమ్మవద్దని సూచించారు. ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ వెల్లడించరాదని, సైబర్ మోసాలకు గురైన వెంటనే పోలీసులను లేదా సంబంధిత సైబర్ విభాగాన్ని సంప్రదించాలని అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఎస్ఐలు రజనీకర్, చిరంజీవి, ప్రత్యేక పార్టీ సిబ్బంది పాల్గొని డ్రగ్స్ దుష్పరిణామాలు,సైబర్ నేరాల నివారణపై ప్రజలకు వివరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో సుమారు 100 మంది ప్రజలు పాల్గొని పోలీసుల సూచనలు, సలహాలను ఆసక్తిగా విన్నారు.

## సూపర్ ఎలినో ప్రభావంపై రైతులకు అవగాహన

**-ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలి..**
**-జలసిరి పథకం సద్వినియోగం చేసుకోవాలి: వ్యవసాయ శాఖ**



**వెల్దండ**
వెల్దండ మండలంలోని కుప్పగండ్ల రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సూపర్ ఎలినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి సంరక్షణ చర్యలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ, సూపర్ ఎలినో ప్రభావం కారణంగా ఈ ఏడాది సాధారణం కంటే వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు పంటల ఎంపికలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధిక నీటి అవసరమయ్యే వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో అధిక దిగుబడులు అందించే పెసర, మినుము, కంది, ఉలవలు వంటి ఆరుతడి పంటలను సాగు చేయడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని వివరించారు. అలాగే ప్రభుత్వం జలసిరి పథకం కింద అమలు చేస్తున్న వ్యవసాయ కుంటలు (ఫాం పాండ్లు), ఇంకుడు గుంతలు, బోర్వెల్ రీఛార్జ్ వ్యవస్థలు, మ్యాజిక్ సోక్పిట్లు, ఉమ్మడి సోక్పిట్ల వంటి నీటి సంరక్షణ కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ చర్యల ద్వారా భూగర్భ జలాల మట్టం పెరగడంతో పాటు భవిష్యత్తులో నీటి కొరతను అధిగమించేందుకు వీలవుతుందని తెలిపారు. రైతులు మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ పద్ధతులను అవలంబించి, ప్రభుత్వ సూచనలు, పథకాలను వినియోగించుకోవాలని అధికారులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి హబీబున్నిసా, ఏపీఎం, పంచాయతీ కార్యదర్శి నందకిషోర్, సర్పంచ్ రమేష్తో పాటు కుప్పగండ్ల గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నాగిరెడ్డి కాలనీ అభివృద్ధికి కృషి: మాజీ ఎంపీ,రాష్ట్ర పిసిసి ప్రచార కార్యదర్శి మధుయాష్కిగౌడ్



**ఎల్బీనగర్**
నాగిరెడ్డి కాలనీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానని మాజీ ఎంపీ, రాష్ట్ర పిసిసి ప్రచార కార్యదర్శి మధుయాష్కిగౌడ్ స్పష్టం చేశారు. శనివారం సాహెబ్ నగర్,వనస్థలిపురం నాగిరెడ్డి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నాగిరెడ్డి కాలని ముఖ ద్వారం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎంపీ, రాష్ట్ర పిసిసి ప్రచార కార్యదర్శి మధుయాష్కిగౌడ్, మాజీ కార్పొరేటర్లు ముద్దగౌని లక్ష్మీ ప్రసన్న గౌడ్, మొద్దు లచ్చిరెడ్డి, సాహెబ్ నగర్ బిజెపి డివిజన్ ప్రెసిడెంట్ గంగం ప్రేమ్ నాథ్ , ముఖ ద్వారం దాత జె. లక్ష్మీ గణపతి రావు లు హాజరై ప్రారంభించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ నాగిరెడ్డి కాలనీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానని తెలిపారు. సాహెబ్ నగర్ బిజెపి డివిజన్ ప్రెసిడెంట్ గంగం ప్రేమ్ నాథ్ మాట్లా డుతూ నాగిరెడ్డి కాలనీలోని అంతర్గత రోడ్ల మరమ్మ త్తులు చేయించానని తెలిపారు. అనంతరం అన్నప్రాస వితరణ చేశారు. కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి పృథ్వి చౌదరి, శక్తి మాపక షి రాష్ట్ర కోఆర్డినేటర్ విద్యా రెడ్డి, గాయత్రి నగర్ మాజీ గౌరవ అధ్యక్షులు డా,, విజయ్ కుమార్, నాగిరెడ్డి కాలనీ గౌరవ అధ్యక్షులు బి. పద్మ పూల్ సింగ్,అధ్యక్షులు వెంకటేష్ గౌడ్, ఉపాధ్యక్షులు ప్రధాన కార్యదర్శి కె.యస్.ఆర్. సోమ యాజులు,వి. పద్మావతీ దేవి,సంయుక్త కార్యదర్శులు పి.సతీష్ కుమార్,ఎన్. పావని కిరణ్, సాంస్కృతిక కార్యదర్శులు ఎస్. వెంకటేశ్వర్లు,గౌరవ సలహాదారులు ,వై. సాయి ప్రసాద్ రెడ్డి,ఇ.సి. మెంబర్స్ పి. రాంబాబు గౌడ్,ఇ. నవీన్ కుమార్ శర్మ,కె. మురళీ ముకుంద్, బి. నాగరాజు,ఎమ్. మంజూష,సి.హెచ్. లీలావతి కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



## గాయత్రి నగర్ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తా:

### -మాజీ ఎంపీ,రాష్ట్ర పిసిసి ప్రచార కార్యదర్శి మధుయాష్కిగౌడ్

**ఎల్బీనగర్ :**
గాయత్రి నగర్ కాలనీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానని మాజీ ఎంపీ, రాష్ట్ర పిసిసి ప్రచార కార్యదర్శి మధుయాష్కిగౌడ్ స్పష్టం చేశారు. శనివారం సాహిబ్ నగర్, వనస్థలిపురం గాయత్రి నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర పిసిసి ప్రచార కార్యదర్శి మధుయాష్కిగౌడ్, మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీ ప్రసన్న గౌడ్ కి కాలనీ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. మధుయాష్కిగౌడ్ సానుకూలంగా స్పందించి కాలనీలోని అంతర్గత సిసి రోడ్ల మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గాయత్రీ నగర్ మాజీ గౌరవ అధ్యక్షులు డాక్టర్ విజయ్ కుమార్ , అధ్యక్షులు వి.కిరణ్ ప్రకాష్ , కోశాధికారి నీనా భవాని తదితరులు పాల్గొన్నారు.



Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony, Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi.
RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co